మా అక్షరాలు - నిజాల నిప్పు కణికలు

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 207 వెల - రూ 5:00

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yad





# ఒకే కార్డుతో అన్ని సేవలు

**సంక్షేమ పథకాల కోసమే డిజిటల్ కార్డులు**

**ఫ్యామిలీ డిజిటల్ కార్డు కుటుంబానికి రక్షణ కవచం**

**ఫ్యామిలీ కార్డు ఉంటే రేషన్ ఎక్కడైనా తీసుకోవచ్చు**

**రేషన్ కార్డు కోసం పదేళ్లు కార్యాలయాల చుట్టూ తిరిగిన వేసారిన ప్రజలు**

**హైడ్రాపై అఖిలపక్షం ఏర్పాటు చేస్తాం**

**మూసీ వల్ల నల్గొండ ప్రజలు విషాన్ని మింగుతున్నారు**

**సికివిలేజ్ ప్రాంగణంలో డిజిటల్ కార్డులను ప్రారంభించిన సీఎం రేవంత్**



హైదరాబాద్, (ప్రజా మంటలు):
సంక్షేమ పథకాల అమలు కోసం డిజిటల్ కార్డులు అవసరమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ సిక్ విలేజ్ ప్రాంగణంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న డిజిటల్ కార్డులను గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ... సంక్షేమ పథకాలు అందరికీ అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో కుటుంబ డిజిటల్ కార్డులు ప్రవేశపెట్టినట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో రేషన్‌కార్డు కోసం పదేళ్లు ప్రజలు ఆఫీసుల చుట్టూ తిరిగారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ అధికారంలో ఉంటే రేషన్‌కార్డు రాదని కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇచ్చారని తెలిపారు. కొత్త రేషన్‌కార్డులు లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు అందడం లేదని అన్నారు. ప్రతి పేదవాడికి ఈ కార్డు ఇవ్వాలన్న లక్ష్యంతో ఉన్నామని తెలిపారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డు కుటుంబానికి రక్షణ కవచమని అన్నారు. కార్డులో కుటుంబానికి సంబంధించిన వివరాలు ఉంటాయని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరికీ గుర్తింపు నెంబర్ ఇచ్చి పథకాలు అమలు చేస్తామని తెలిపారు. ఆస్పత్రి రిపోర్టులు కూడా కార్డులోనే డిజిటల్‌గా ఉంటాయని చెప్పారు. పేదలకు సులభతరమైన సంక్షేమం అమలు చేయడమేతమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. 239 చోట్ల డిజిటల్ కార్డుల పథకం పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టామని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు.

మూసీ అభివృద్ధికి ప్రత్యామ్నాయం చూపితే సిద్ధమే

హైదరాబాద్ నగరాన్ని కాపాడాలన్న ఉద్దేశంతోనే హైడ్రా, మూసీ ప్రాజెక్టులను తీసుకువచ్చామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు. కిరాయి మనుషులతో బీఆర్ఎస్ నేతలు చేసే హడావుడి తెలంగాణ సమాజం గమనిస్తోందని చెప్పారు. పదేళ్లు బీఆర్ఎస్ నేతలు దోచుకున్న సొమ్ము వాళ్ల పార్టీ ఖాతాలో రూ.1500 కోట్లు మూలుగుతున్నాయని విమర్శించారు. అందులోంచి రూ.500 కోట్లు మూసీ ప్రాంత పేదలకు పంచి పెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. ప్రత్యామ్నాయం ఏం చేయాలో చెప్పాలని అన్నారు. ప్రభుత్వం వినడానికి సిద్ధంగా ఉందని అన్నారు. హైడ్రాపై అసెంబ్లీలో చర్చ జరిగినప్పుడు ఎందుకు మాట్లాడలేదని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఇకపోతే కేసీఆర్ ప్రభుత్వం పదేళ్లలో చేసింది తప్పులు.. అప్పులే.. వీటితో తెలంగాణ నిండా మునిగిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఆ తప్పులు... అప్పులను సరిదిద్దుతూ ముందుకు వెళ్తున్నామని అన్నారు. పదేళు అధికారంలో ఉన్నవారు కంటోన్మెంట్ సమస్యలను ఎందుకు పరిష్కరించలేదని ప్రశ్నించారు. తాము అధికారంలోకి వచ్చాక కేంద్రానికి భూ బదలాయింపు ద్వారా కంటోన్మెంట్ ప్రజలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. కల్వకుంట్ల కుటుంబం అధికారంతో పాటు విచక్షణ కోల్పోయిందని ఎద్దేవా చేశారు.. పదేళ్లు నిరుద్యోగుల ఉసురు పోసుకున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. అందుకే ప్రజలు కేసీఆర్ ఉద్యోగం ఊడగొట్టారని ఎద్దేవా చేశారు. తాము అధికారంలోకి వచ్చాక ఉద్యోగ నియామకాలు చేపట్టామని స్పష్టం చేశారు. మూసీ మురుగులో బతుకుతున్న పేదలకు ఇళ్లు, రూ.25వేలు ఇచ్చి వారి ఆత్మగౌరవాన్ని పెంచుతున్నాం. బీఆర్ఎస్ నేతల ఫాంహౌస్‌లను కాపాడుకోవడానికే పేదల ముసుగు అడ్డం పెట్టుకుంటున్నారు. మాజీ మంత్రి కేటీఆర్ అక్రమంగా నిర్మించిన ఫాంహౌస్‌లు కూల్చాలా వద్దా? మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ముగ్గురు కొడుకులకు ఫామ్ హౌస్‌లు ఉన్నాయి.

మిగతా 2లో..

# రైతులను మోసం చేస్తే క్రిమినల్ కేసులే..

- సన్నాల పేరిట జరిగే గోల్‌మాల్‌కు కట్టడి
- ధాన్యం కొనుగోళ్లపై ప్రత్యేక ఫోకస్
- సన్న వడ్లకు క్వింటాకు రూ.500 బోనస్
- 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో జమ
- జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో సీఎం వీడియో కాన్ఫరెన్స్



హైదరాబాద్, (ప్రజా మంటలు):
రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సాఫీగా జరిగేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇప్పటికే రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ఈ సీజన్ నుంచే సన్నాలకు ఎమ్మెస్పీకి అదనంగా ఒక్కో క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లిస్తుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గత సీజన్ లో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మిన రైతులకు మూడు రోజుల్లో డబ్బులు ఇచ్చామని, ఈసారి 48 గంటల్లోపే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,

మిగతా 2లో..

## మతాలకు అతీతంగా దేశ ప్రతిష్ఠను పెంచేది క్రీడాకారులే

**- ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత క్రీడలను నిర్లక్ష్యం చేశారు - సీఎం రేవంత్‌రెడ్డి**



హైదరాబాద్, (ప్రజా మంటలు):
ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత క్రీడలను నిర్లక్ష్యం చేశారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. సీఎం కప్ క్రీడా జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరిగింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ. రాబోయే రోజుల్లో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీతో పాటు అకాడమిని ప్రారంభించి క్రీడాకారులందరికీ శిక్షణ ఇస్తామని తెలిపారు. చదువే కాదు..

మిగతా 2లో..

## జైళ్లలో కుల వివక్షపై సుప్రీం ఆగ్రహం

- కింది కులాలతో ఊడ్చడం, మరుగుదొడ్లు, సెప్టిక్ ట్యాంకులు శుభ్రం చేయాస్తారా!
- అగ్రకులాలకు కేవలం వంటపనేనా..!
- ఇది ఆర్టికల్ 15 అతిక్రమించడమే..
- సమానత్వ హక్కుకు వ్యతిరేకం కూడా..
- సుప్రీం కోర్టు జస్టిస్ డివై చంద్రచూడ్ విచారం
- ఇలాంటి అభ్యంతరక నిబంధనలను సవరించాలని ఆదేశాలు



న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):
జైళ్లలో ఖైదీలకు కులం ఆధారంగా పనులు కేటాయించడంపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఒక కులానికి చెందిన వ్యక్తులనే స్వీపర్లుగా ఎంపిక చేయడం సరైన విషయం కాదని పేర్కొంది. అన్ని కులాలకు చెందిన ఖైదీలను మానవత్వంతో సమానంగా చూడాలని చెప్పింది. జైళ్లలో కులవివక్షపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కొన్ని రాష్ట్రాల్లో కులం ఆధారంగా ఖైదీలకు పనుల అప్పగింత, జైలులో గదుల కేటాయింపునకు సంబంధించిన నిబంధనలను తప్పుబట్టింది. అభ్యంతరకరంగా ఉన్న నిబంధనలను మూడు నెలల్లో మార్చాలని పలు రాష్ట్రాలకు సూచించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ సారథ్యంలోని ధర్మాసనం గురువారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.

మిగతా 2లో..

### పాలిట్రిక్స్

ఆ కార్డు ఈ కార్డు
ఇన్ని కార్డులెందుకు,
ఇక డిజిటల్ కార్డు
వస్తున్నది చెంతకు !


కాసులు రాల్చే మూసీ
ప్రాజెక్టు వాళ్ల కొరకు ,
అడుక్కోడానికి మాత్రం
కార్డు 'షో'లు మనకు !

- న్యాలకంటి నారాయణ
9346200066

## మంత్రి కొండా సురేఖపై నాగార్జున పరువునష్టం దావా

హైదరాబాద్, (ప్రజా మంటలు):
దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై హీరో నాగార్జున నాంపల్లి కోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు నాంపల్లి కోర్టులో నాగార్జున పరువు నష్టం దావా వేశారు. తమ కుటుంబ గౌరవాన్ని, ప్రతిష్టను దెబ్బతీసేలా కొండా సురేఖ వ్యాఖ్యలు చేశారంటూ నాగార్జున న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కొండా సురేఖపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని పిటిషన్‌లో నాగార్జున కోరారు. శుక్రవారం నాగార్జున పిటిషన్‌పై కోర్టు విచారణ జరిపే అవకాశం ఉంది. 'మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు అసంబద్ధం. అబద్ధం' అని సినీ నటుడు అక్కినేని నాగార్జున ఇప్పటికే ఎక్స్ వేదికగా స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. 'రాజకీయాలకు దూరంగా ఉండే సినీప్రముఖుల జీవితాలను, మీ ప్రత్యర్థులను విమర్శించేందుకు వాడుకోకండి.. సాటి మనుషుల వ్యక్తిగత జీవితాలను గౌరవించండి' అని సూచించారు. సురేఖ వ్యాఖ్యలను బుధవారం ఎక్స్ వేదికగా ఆయన ఖండించారు. బాధ్యత కలిగిన పదవిలో ఉన్న మహిళగా మంత్రి కొండా సురేఖ వాఖ్యలు తమ కుటుంబం పట్ల, చేసిన ఆరోపణలు పూర్తిగా అసంబద్ధమని, అబద్ధమని తేల్చిచెప్పారు. తక్షణమే ఆమె తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.తమ కుటుంబంపై మంత్రి కొండా సురేఖ చేసిన అసంబద్ధ వ్యాఖ్యలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి సినీనటుడు అక్కినేని నాగార్జున సతీమణి, నటి అకినేని అమల ఫిర్యాదుచేశారు. తన కుటుంబంపై సురేఖ అసత్య ఆరోపణలు చేశారని మండిపడ్డారు. రాజకీయ వివాదాల్లోకి తమను లాగవద్దని, తన భర్త గురించి నిరాధార ఆరోపణలు చేయడం సిగ్గుచేటని ఘాటుగా స్పందించారు.

## ప్రజా నాడి






## అజారుద్దీన్‌కు ఈడీ నోటీసులు

హైదరాబాద్, (ప్రజా మంటలు):
హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌కు అజరుద్దీన్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో అక్రమాలు జరిగాయని నమోదైన అవినీతి కేసుల్లో ఈడీ కూడా విచారణ చేపట్టింది. అక్రమ నగదు లావాదేవీలు జరిగాయని కేసు నమోదు చేసి మాజీ హెచ్‌సీఏ అధ్యక్షుడు అజహరుద్దీన్‌కు నోటీసులు జారీ చేసింది. అయితే ఈడీ ఎదుట హాజరయ్యేందుకు తనకు సమయం కావాలని అజరహద్దీన్ కోరినట్లుగా తెలుస్తోంది. ప్రస్తుతం అజారుద్దీన్ కాంగ్రెస్ పార్టీ నేతగా ఉన్నారు. ఆయన గత ఎన్నికల్లో జూబ్లిహిల్స్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలతో చాలా కాలంగాపాటు నిషేధానికి గురైన అజహరుద్దీన్ ..నిషేధ కాలం తర్వాత క్రికెట్ రాజకీయాల్లోకి వచ్చారు.

మిగతా 2లో..

## పార్టీ మారిన ఎమ్మెల్యేల కేసు.. సింగిల్ బెంచ్ తీర్పుపై స్టే ఇవ్వలేం

**- 24న వాదనలు వింటామన్న హైకోర్టు**



హైదరాబాద్, (ప్రజా మంటలు):
తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేల కేసు మరో కీలక పరిణామం జరిగింది. గతంలో సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును కొట్టివేయాలన్న అసెంబ్లీ సెక్రటరీ అభ్యర్థనను హైకోర్టు డివిజన్ బెంచ్ తిరస్కరించింది. స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. ఈ విషయంపై ఈనెల 24న వాదనలను వింటామని తెలిపింది. బీఆర్ఎస్ పార్టీ తరఫున విజయం సాధించి అధికార కాంగ్రెస్‌లోకి వెళ్లిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి సహా పలువురు వేసిన పిటిషన్ హైకోర్టు డివిజన్ బెంచ్ విచారించింది. నెల రోజులు క్రితం సెప్టెంబర్ 9న విచారణ సందర్భంగా అసెంబ్లీ సెక్రటరీకి, స్పీకర్‌కు సూచనలు చేసింది. నెల రోజుల్లో నిర్ణయం తీసుకొని షెడ్యూల్‌ను బెంచ్ ముందు ఉంచాలని ఆదేశించింది. లేకుంటే సుమోటోగా తామే ఓ నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసింది. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ అసెంబ్లీ సెక్రటరీ హైకోర్టు డివిజన్ బెంచ్‌కు వెళ్లారు. సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులపై స్టే ఇవ్వాలని కోరారు. ఇప్పటికిప్పుడు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడం కుదరని చెప్పేసింది. తదుపరి వాదనలు 24న వింటామని పేర్కొంది. హైకోర్టులో ఏప్రిల్‌లో పిటిషన్ వేసే నాటికి బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు పార్టీ మారారు. వాళ్లపై అనర్హత వేటు వేయాలని స్పీకర్‌కు ఆదేశాలు ఇవ్వాలంటూ పిటిషన్ వేశారు. ఈ పిటిషన్లు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద, బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై ఆగస్టు 7న వాదనలు పూర్తి అయ్యాయి. తర్వాత తీర్పును హైకోర్టు సింగిల్ బెంచ్ రిజ్వర్ చేసింది. సెప్టెంబర్ 9న సోమవారం నాడు తీర్పు వెలువరించింది. ఏప్రిల్ తర్వాత మరికొందరు ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీలో చేరారు. అలా వెళ్లి వచ్చిన ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని పీఏసీ ఛైర్మన్‌గా కూడా చేయడం ఈ మధ్య కాలంలో పెను వివాదానికి కారణమైంది. ఆ టైంలో కౌశిక్ రెడ్డి, అరికెపూడి గాంధీ మధ్య తీవ్ర వార్ నడిచింది. తాను ఇంకా బీఆర్ఎస్‌లోనే ఉన్నానంటూ అరికెపూడి వాదిస్తుంటే...లేదు పార్టీ మారుతున్నట్టు కండువా కూడా మార్చుకున్నారని ఆరోపిస్తూ వస్తోంది బీఆర్ఎస్. ఈ వివాదాలు నడుస్తుండగానే అసెంబ్లీ సెక్రటీ అభ్యర్థను హైకోర్టు డివిజన్ బెంచ్ తిరస్కరించడంతో తర్వాత ఏం జరగనుందనే ఆసక్తి మొదలైంది.

మొదటి పేజీ తరువాయి

# ఒకే కార్డుతో అన్ని సేవలు



వాటిని కూలగొట్టాలా వద్దా..?
ఫాంహౌస్‌లు కూలుతాయనే పేదలను అడ్డు పెట్టుకుంటున్నారు. నల్లచెరువులో, మూసీనది ఒడ్డున ప్లాట్లు చేసి అమ్మింది బీఆర్ఎస్ పార్టీ నాయకులు కాదా..? 20ఏళ్లు ప్రజల్లో తిరిగిన వాన్ని నాకు పేద ప్రజల కష్టాలు తెలియదా? మూసీని అడ్డుపెట్టుకుని ఎంతకాలం తప్పించుకుంటారు..? జవహర్ నగర్‌లో 1000 ఎకరాలు ఉంది... రండి పేదలకు పంచి ఇందిరమ్మ ఇళ్లు కట్టిద్దాం. ఇక్కడి ఎంపీ ఈటల రాజేందర్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దగ్గర నుంచి ఏం తీసుకువస్తారో చెప్పాలి. సబర్మతి రివర్ ఫ్రంట్ అభివృద్ధి చేయొచ్చు కానీ.. మూసీని అభివృద్ధి చేయొద్దా ఈటలా? కేటీఆర్, హరీష్‌రావులు మాట్లాడిన జిరాక్స్ కాపీ తీసుకుని ఈటల మాట్లాడుతున్నారు. పార్టీ మారినా ఈటలకు పాత వాసనలు పోలేదు. మూసీ పరివాహక ప్రాంతాల పేదలకు ఇళ్లు తీసుకురావడానికి మోదీ దగ్గరకు వెళ్దాం రండి... నాకు రావడానికి ఎలాంటి భేషజాలు లేవు.. బీఆర్ఎస్, బీజేపీ నాయకులు రావాలి. నగరంలో చెరువులు, ఆక్రమణల లెక్క తీద్దాం రండి... వందలాది గొలుసుకట్టు చెరువులు ఆక్రమణకు గురయ్యాయి. దీంతో వరదలు వచ్చి లక్షలాది కుటుంబాలు ఆగమవుతున్నాయని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే చెరువులు, నాళాలు మూసుకు పోయాయి.. ఇలాగే చూస్తే.. ఇంకొన్నాళ్లకు మూసీ కూడా మూసుకుపోతుంది.. రాజకీయాల్లో నాకు లోతు తెలియక కాదు.. భాగ్యనగరానికి మంచిభవిష్యత్‌ను అందించేందుకే మా చర్యలు.. పేదల దుఃఖం నాకు తెలుసు.. పేదవాడి కన్నీళ్లు చూడాలని మేం కోరుకోవడంలేదు. ప్రతీ పేదవాడికి ప్రత్యామ్నాయం చూపించడమే మా ప్రభుత్వ ఉద్దేశం.. చెరువులు, నాళాలు, మూసీ ఆక్రమణలు తొలగించాల్సిందే... పేదలకు ఎలా న్యాయం చేద్దామో మీరు చెప్పండి... మీ పదేళ్ల పాలన దోపిడీకే పనికి వస్తుందా...? పదేళ్లు పాలించామని, అనుభవం ఉందని చెబుతున్న వారు పేదలకు ఏం చేద్దామో చెప్పాలి. మొత్తం మంత్రివర్గాన్ని తీసుకువస్తా.. మోదీ వద్దకు తీసుకెళ్లి ఈటల రాజేందర్ రూ.25వేల కోట్లు నిధులు ఇప్పించగలరా... ఇళ్లు లేని పేదలకు ఇళ్లు ఇవ్వడం నేరమా? విషాన్ని దిగమింగుతున్న నల్లగొండ ప్రజలను కాపాడాలని అనుకోవడం తప్పా. మీకు ఓటు వేయనందుకు నల్లగొండ ప్రజలను చంపేయాలని చూస్తారా? మీలాంటి వారి కోసం బుల్డోజర్లు అవసరం లేదు. రాజకీయాల కోసం మూసీ ప్రాజెక్టు చేపట్టలేదు.. హైదరాబాద్ భవిష్యత్ కోసమే మేం ఈ ప్రాజెక్టు చేపడుతున్నాం. సంచులు తీసుకున్నవారికే సంచుల గురించి తెలుస్తుంది.. ఇళ్లు తొలగిస్తే ఎవరైనా సంచులు ఇస్తారా? తిట్లు తప్ప. దోపిడీ సొమ్ముతో కేటీఆర్ అడ్డగోలు పనులు చేస్తే ప్రజలు క్షమించరని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్రంగా హెచ్చరించారు.

## మతాలకు అతీతంగా దేశ ప్రతిష్ఠను పెంచేది క్రీడాకారులే

క్రీడల్లో రాణించినా మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. మతాలకు అతీతంగా దేశ ప్రతిష్ఠను పెంచేది క్రీడాకారులేనని సీఎం అన్నారు."25ఏళ్ల క్రితం హైదరాబాద్‌లో ఏషియన్ గేమ్స్ సహా ఇతర క్రీడలు నిర్వహించారు. అప్పుడు హైదరాబాద్ దేశానికి ఆదర్శంగా నిలిచింది. కానీ, తెలంగాణ వచ్చిన తర్వాత క్రీడలను నిర్లక్ష్యం చేశారు. యువత డ్రగ్స్, గంజాయికి అలవాటు పడుతుంటే ఎంతో బాధపడ్డాం. కానీ, ప్రస్తుతం క్రీడలకు హైదరాబాద్ హబ్‌లా మారేలా కృషి చేస్తున్నాం. బాక్సింగ్‌లో రాణిస్తున్న నిఖత్ జరీన్‌కు డీఎస్పీ ఉద్యోగం ఇచ్చాం. క్రికెటర్ సిరాజ్‌కు ఉద్యోగం ఇచ్చి.. ఆర్థికంగా ఆదుకునే ప్రయత్నం చేశాం. గతంలో రాష్ట్రానికి, దేశానికి పేరు తెచ్చిన క్రీడాకారుల కుటుంబాలను ఆదుకుంటాం. అండర్-17 క్రికెట్ టీమ్‌ను తెలంగాణ ప్రభుత్వం దత్తత తీసుకుంది. ఒలింపిక్స్‌లో భారత్ పరిస్థితిని యువత ఆలోచించాలి. అందుకే తెలంగాణలో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. కులం, మతంతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ కలిసే చోటు క్రీడా మైదానాలు మాత్రమే" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

# రైతులను మోసం చేస్తే క్రిమినల్ కేసులే..



పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గురువారం సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడారు. మంత్రులు సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు జిల్లాల నుంచి ఈ కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, సివిల్ సప్లయిస్ ఎండీ డీఎస్ చౌహన్ వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి రఘునందన్? రావు, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లకు ఈసారి రాష్ట్రవ్యాప్తంగా 7 వేలకుపైగా కొనుగోలు కేంద్రాలు నెలకొల్పినట్లు సీఎం ప్రకటించారు. ఇప్పటికే గుర్తించిన కేంద్రాలు కాకుండా.. ఎక్కడైనా కొనుగోలు కేంద్రం అవసరమని కలెక్టర్లు భావిస్తే అక్కడ కొత్త కేంద్రం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రాష్ట్రంలో ఈ వానాకాలంలో 66.73 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో 140 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసిందని సీఎం చెప్పారు. సన్న వడ్లకు బోనస్ ఇవ్వటం ఇదే మొదటిసారి కావటంతో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఎక్కడా ఎలాంటి తప్పుడు జరగకుండా చూడాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్లపై ఉందని అన్నారు. సన్నవడ్ల సేకరణకు వీలుగా వేర్వేరు కొనుగోలు కేంద్రాలు, లేదా కొనుగోలు కేంద్రాల్లో వేర్వేరు కాంటాలు ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. సన్న వడ్లు కొనేటప్పుడు నిర్దేశించిన ప్రమాణాలు తప్పకుండా పాటించాలని అధికారులను అప్రమత్తం చేశారు. సన్న రకాలను ధ్రువీకరించే యంత్రాలు, సిబ్బందిని అన్ని కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని చెప్పారు. సన్న వడ్ల సేకరణలో అప్రమత్తంగా లేకపోతే గోల్‌మాల్‌జరిగే ప్రమాదముందని ముఖ్యమంత్రి హెచ్చరించారు. అటువంటి తప్పులు, అవకతవకలు జరగకుండా కట్టుదిట్టంగా వ్యవహరించాలని చెప్పారు. ప్రతి కేంద్రానికి ఒక నెంబర్ కేటాయించాలని, ఆ కేంద్రంలో కొనుగోలు చేసిన వడ్ల సంచులపైన ఆ నెంబర్ తప్పకుండా వేయాలని సూచించారు. దీంతో ఏ తప్పు జరిగినా, ఏ దశలో గోల్ మాల్‌జరిగినా ఎక్కడ జరిగిందో సులభంగా తెలుసుకునే వీలుంటుందని చెప్పారు. సరిహద్దు రాష్ట్రాల నుంచి ధాన్యం రాష్ట్రంలోకి రాకుండా కట్టడి చేయాలని ముఖ్యమంత్రి పోలీస్ అధికారులను అప్రమత్తం చేశారు. అన్ని మార్గాల్లోనూ పకడ్బందీగా నిఘా ఉంచాలని, చెక్ పోస్టుల వద్ద నిరంతర పర్యవేక్షణ ఉండాలని చెప్పారు తాలు ,తరుగు, తేమ పేరు తో రైతులను మోసం చేసే వారిని సహించవద్దని, అవసరమైతే క్రిమినల్ కేసులు పెట్టాలని సీఎం చెప్పారు. రైతులు ఎక్కడ కూడా దోపిడీకి గురి కాకూడదని, రైతుల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును కలెక్టర్లు బాధ్యతగా స్వీకరించాలని కోరారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లో సరిపడే సంఖ్యలో గోనె సంచులు, టార్ఫాలిన్లు, మాయిశ్చర్ మిషన్లు, డ్రైయర్లు, ప్యాడీ క్లీనర్లు అందుబాటులో ఉంచాలని చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని వెంట వెంటనే తరలించేందుకు తగిన రవాణా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ప్రతి గంటకోసారి కొనుగోలు కేంద్రాలకు వాతావరణ శాఖ సూచనలను చేరవేయాలని, దానికి అనుగుణంగా కేంద్రాల్లో ధాన్యం తడవకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రతి రోజు కలెక్టర్లు తమ జిల్లాలో జరుగుతున్న కొనుగోళ్ల ప్రక్రియను సమీక్షించాలని, ప్రతి రోజు ఉదయం నేరుగా క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లి కేంద్రాలను పరిశీలించాలని ఆదేశించారు. పాత పది జిల్లాలకు నియమించిన ప్రత్యేకాధికారులు ధాన్యం సేకరణ ప్రక్రియను పర్యవేక్షించాలని సీఎం సూచించారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన సమస్యలుంటే ఏ రోజుకారోజు పరిష్కరించాలని, సివిల్ సప్లయిస్ విభాగంలో కాల్ సెంటర్ ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. ఈ ఏడాది రాష్ట్రంలో వరి సాగు చేసిన విస్తీర్ణంలో 58 శాతం సన్న రకాలు సాగయ్యాయి. ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకంతో వచ్చే ఏడాది నుంచి సన్నాల దిగుబడి మరింత పెరుగుతుందని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. క్రమంగా రాష్ట్రంలో వంద శాతం సన్న వడ్లు పండించే రోజులు వస్తాయన్నారు. దొడ్డు వడ్లకు మార్కెట్లో డిమాండ్ లేదని, ఎఫ్‌సీఐ వద్ద కూడా భారీగా నిల్వలున్నాయని, అందుకే సన్న రకపు వరి సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని చెప్పారు. వచ్చే జనవరి నుంచి రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తామన్నారు. ఈసారి దిగుబడి అయ్యే 146 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యంలో ట్రేడర్లు, మిల్లర్లు, కొనుగోలు చేసే ధాన్యం, రైతులు తమ అవసరాలకు ఉంచుకునే నిల్వలు పక్కనపెడితే.. 91 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంటుందని అంచనా వేశారు. అందులో 44 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు రకం, 47 లక్షల మెట్రిక్ టన్నుల సన్న రకాలు ఉంటాయని చెప్పారు. అన్ని జిల్లాల్లోనూ కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లర్లకు ఇచ్చే విషయంలోనూ కలెక్టర్లు నిబంధనలను పాటించాలని చెప్పారు. డిఫాల్ట్ లేని మిల్లర్లకు ధాన్యం ఇవ్వాలని సూచించారు. డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలనఅన్ని జిల్లాల్లో డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలనను 5వ తేదీలోగా పూర్తి చేయాలని కలెక్టర్లను సీఎం ఆదేశించారు. మొత్తం 11062 మంది ఎంపికైన అభ్యర్థులకు దసరా పండుగలోపు నియామక పత్రాలను అందిస్తామని ప్రకటించారు. అక్టోబర్ 9వ తేదీన ఎల్బీ స్టేడియంలో నియామక పత్రాలు అందించేందుకు వీలుగా జిల్లాల్లో వేగంగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటికే 9090 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయిందని విద్యాశాఖ అధికారులు సీఎంకు వివరించారు.

## జైళ్లలో కుల వివక్షపై సుప్రీం ఆగ్రహం

కులం ఆధారంగా ఊడ్చడం, శుభ్రం చేయడం వంటి పనులను అట్టడుగు వర్గాలకు అప్పగించడం, వంట చేయడం లాంటి పనులను అగ్ర వర్ణాలకు అప్పగించడం అంటే అది ఆర్టికల్ 15ను అతిక్రమించడమేనని వ్యాఖ్యానించింది సుప్రీంకోర్టు. అలాంటి పనులు విభజనకు దారి తీస్తాయని పేర్కొంది. ఖైదీల పట్ల వివక్షకు కులం కారణం కారాదని స్పష్టం చేసింది. అలాంటి వాటిని అనుమతించేది లేదని ధర్మాసనం తేల్చిచెప్పింది. అందరికీ పని విషయంలో సమాన హక్కు కల్పించాలని పేర్కొంది. ప్రమాదకరంగా ఉన్న మురుగునీటి ట్యాంకులను శుభ్రం చేసే పనులకు ఖైదీలను అనుమతించకూడదని సూచించింది. ఓ ప్రత్యేక కులం వారిని స్వీపర్లుగా ఎంపిక చేయటం సమానత్వ హక్కుకు వ్యతిరేకమని ధర్మాసనం స్పష్టం చేసింది. కుల ఆధారిత వివక్షకు సంబంధించిన కేసుల పరిష్కారానికి పోలీసులు కూడా శ్రద్ధతో పనిచేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.జైళ్లలో కుల ఆధారిత వివక్ష, విభజన ఉందని ఆరోపిస్తూ మహారాష్ట్రలోని కల్యాణ్‌కు చెందిన సుకన్య శాంత సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన ధర్మాసనం ఈ ఏడాది జనవరిలోనే కేంద్రంతో పాటు ఉత్తర్‌ప్రదేశ్,బంగాల్ సహా 11 రాష్ట్రాలకు నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు స్పందించిన ఆయా రాష్ట్రాలు ఖైదీలకు కులం ఆధారంగానే పనులు ఇవ్వడం, జైలులో గదులను కేటాయిస్తున్నట్లు పేర్కొన్నాయి. దీనిపై స్పందించిన సుప్రీం కోర్టు ఇలా చేయడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంది. ఖైదీలకు న్యాయప్రకారం.. పనులను కేటాయించాలని సుప్రీం ఆదేశించింది. ఇలాంటి నిబంధనలను సవరించాలని ఆయా రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసింది. అందుకోసం మూడు నెలల డెడ్‌లైన్ విధించింది.జైలు మాన్యువల్స్‌లో ఉన్న ఇలాంటి అభ్యంతరకర నిబంధలను సవరించాలని ఆయా రాష్ట్రాలను ఆదేశించింది.

## అజారుద్దీన్‌కు ఈడీ నోటీసులు

ఆంధ్రా క్రికెట్ అసోసియేన్ అధ్యక్షుడిగా గెలిచారు. అయితే ఆయన హయాంలో అనేక అవకతవకలు జరిగాయని ఆరోపణలు వచ్చాయి. 2019 నుంచి 2023 వరకు ఆయన అధ్యక్షుడిగా ఉన్నారు. ఈ సమయంలో జరిగిన అవకతవలపై అనేక ఆరోపణలువచ్చాయి. సభ్యుల మధ్య కూడా తీవ్ర విభేధాలు రావడంతో న్యాయస్థానం జస్టిస్ లావు నాగేశ్వరరావు కమిషన్ నియమించింది. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఉప్పల్ స్టేడియంలో వివిధ సామగ్రి కొనుగోళ్లలో కోట్ల రూపాయల గోల్ మాల్ జరిగిందని అజారుద్దీన్‌పై సంఘంలోనితోటి సభ్యులే ఆరోపణలుచేశారు. హెచ్‌సీఏలో కోట్ల రూపాయల నిధులు గోల్‌మాల్ చేశారని టెండర్ల పేరుతో థర్డ్ పార్టీకి నిధులు కట్టబెట్టారని అజారుద్దీన్‌పై కేసు కూడా నమోదు కావడంతో ఏసీబీ విచారణ చేస్తోంది. అగ్నిమాపక పరికరాలు, క్రికెట్ బంతులు, బకెట్ కుర్చీలు, జిమ్ సామాగ్రితో సహా అనేక పరికరాల కొనుగోలు వ్యవహారంలో అవకతవకలు జరిగినట్లు సాక్ష్యాలు వెల్లడి కావడంతో రాచకొండ పోలీసులు ఆయనపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఈ కేసుల్లోనే ఈడీ కూడా రంగంలోకి దిగింది. తెలంగాణ ఏసీబీ అధికారులు నమోదు చేసిన కేసుల్లో ఇరవై కోట్ల వరకూ అక్రమ లావాదేవీలు జరిగాయని గుర్తించింది. అయిత అజహరుద్దీన్ ఈడీ ఏదుటకు హాజరయ్యేందుకు తటపటాయి స్తున్నారు. కాంగ్రెస్ రాజకీయల్లో గతంలో యూపీ నుంచి ఓ సారి పోటీ చేసి ఎంపీగా గెలిచారు. తర్వాత రాజస్థాన్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. మరోసారి గెలవలేకపోయారు. ఎమ్మెల్యేగా పోటీ చేసినా విజయం దక్కలేదు.

# కేటీఆర్ కేసీఆర్‌ను ఏమైనా చేశాడేమో..!

- ఆయన కనిపించకపోవడంపై అనుమానాలున్నాయి
- ప్రజలు పోలీస్ స్టేషన్ వెళ్లి కేసు పెడతాం
- మరోసారి మంత్రి కొండా సురేఖ విమర్శలు



సిద్దిపేట (ప్రజా మంటలు):
భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌పై మంత్రి కొండా సురేఖ మరోసారి ఆగ్రహం వ్యక్తం చేశారు. గజ్వేల్ పర్యటన సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. సోషల్ మీడియాను అడ్డం పెట్టుకొని తమపై పిచ్చి రాతలు రాయిస్తున్నారని మండిపడ్డారు. తొమ్మిది హామీలు అమలు చేస్తే పదో హామీ ఎందుకు ఇవ్వలేదని కేటీఆర్ ప్రశ్నిస్తున్నారు. పదవీ కాంక్షతో కేసీఆర్‌ని కేటీఆరే ఏదో చేశారన్న ప్రచారం జరుగుతోంది. కేటీఆర్ సీఎం అనుకుని పిచ్చి నిర్ణయాలు తీసుకున్నారు. భారాస ఓడిపోవడానికి ప్రధాన కారణం ఆయనే. బడ్జెట్ రోజు అసెంబ్లీకి వచ్చిన కేసీఆర్ మళ్లీ కనిపించలేదు. ఫామ్‌హౌస్‌లో ఏం చేస్తున్నారో తెలియదు. గజ్వేల్‌లో కేసీఆర్ కనిపించడంలేదని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తాం. పార్లమెంట్ ఎన్నికల్లో సిద్దిపేట, గజ్వేల్ నియోజకవర్గాల్లో భాజపా, భారాస మధ్య చీకటి ఒప్పందం జరిగింది. కవిత బెయిల్ కోసం ప్రధానితో మాట్లాడి ఒప్పందం చేసుకుని.. భారాస నుంచి భాజపాకు క్రాస్ ఓటింగ్ జరిగిందని కొండా సురేఖ ఆరోపించారు. కేటీఆర్‌కి పదవి కాంక్ష ఎక్కువ.. కేసీఆర్‌న్ని ఫామ్ హౌజ్ లోపల కేటీఆర్ గొంతు పిసికిండో ఎమోనన్న అనుమానం వస్తుందని తీన్మార్ మల్లన్న అంటున్నారు. మరీ తీన్మార్ మల్లన్న అనుమానం వ్యక్తం చేసినట్లు ఫామ్‌హౌస్‌లో ఏం జరిగిందో ఏమో కానీ.. గత కొన్ని రోజులుగా కేసీఆర్ మాత్రం కనిపించడం లేదని మంత్రి సురేఖ హాట్ కామెంట్స్ చేశారు. గజ్వేల్ నియోజవర్గం నుండి గెలిచిన వ్యక్తి సలహాలు ఇవ్వమంటే ఎక్కడున్నాడో తెలియదని.. మిమ్మల్ని గెలిపించిన గజ్వేల్ ప్రజలకు కష్టం వస్తే ఎవరికి చెప్పుకోవాలని కేసీఆర్‌ని నిలదీశారు. మా ఎమ్మెల్యే కనబడటం లేదని పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టమని కోరుతున్నానని గజ్వేల్ ప్రజలకు సూచించారు. మెదక్ పార్లమెంట్ సెగ్మెంట్‌లో కాంగ్రెస్ పార్టీ ఎందుకు గెలువలేకపోయిందనే భావన నాలో ఉందన్నారు. బీజేపీకి బీఆరెస్ అమ్ముడు పోవడం వల్లనే కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు మెదక్‌లో ఓటమి పాలయ్యారని ఆరోపించారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కవిత జైల్ నుండి బయటికి రావడం కోసం చీకటి ఒప్పందం చేసుకున్నారని విమర్శించారు. మెదక్‌లో మేము గెలువకున్న సరే బీజేపీని గెలిపించాలనే విధంగా బీఆర్ఎస్ పని చేసిందని మండిపడ్డారు. ప్రజలకు సేవ చేయడానికి మేము ముందుకు పోతుంటే.. పనికి మాలిన సోషల్ మీడియాతో కాంగ్రెస్ పార్టీపై కేటీఆర్ తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఓటమి పాలుకావడానికి ప్రధాన కారణం కేటీఆర్ అని మంత్రి కొండా సురేఖ ఆరోపించారు. అధికారం కోల్పోయే సరికి కేటీఆర్‌కి మతిభ్రమించి తిరుగుతున్నాడని ఫైర్ అయ్యారు. హైడ్రా, మూసీ అంటూ కేటీఆర్ ప్రజల్లో ప్రలోభాలకు తెరలేపు తున్నాడని.. అస్సలు మూసీ ప్రక్షాళనకు తెరలేపింది బీఆర్ఎస్ పార్టీనేనని గుర్తు చేశారు. ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకిస్తూ ప్రజల్లో ప్రలోభాలకు తెరలేపితే ఊపేక్షించబోమని.. ఇకనైనా ఒళ్ళు దగ్గర పెట్టుకుని ఉండాలని ఈ వేదిక ద్వారా హెచ్చరిస్తున్నానని సురేఖ వార్నింగ్ ఇచ్చారు.

# రుణమాఫీ అందని రైతులకు ఆందోళన వద్దు

## - రైతాంగానికి అండగా రేవంత్ ప్రభుత్వం:మంత్రి తుమ్మల

సిద్దిపేట (ప్రజా మంటలు):
తల తాకట్టు పెట్టి అయినా రైతాంగానికి అండగా ఉంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. త్వరలోనే రూ. 2 లక్షల రుణ మాఫీనీ పూర్తిచేస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని గుర్తు చేశారు. గురువారం నాడు గజ్వేల్ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూముకుంట నర్సారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసంగించిన మంత్రి తుమ్మల గత ప్రభుత్వాలు రైతు రుణమాఫీపై మాట కూడా మాట్లాడలేదు. దేశంలో ఏ రైతు పండించని పంటలు మన రైతులు పండిస్తున్నారు. ప్రతి గింజను మార్కెట్ ధర కంటే ఎక్కువకు ప్రభుత్వమే కొని రైతులను ఆదుకుంటాం. రైతును దగా చేసిన వాళ్ల మాటలు నమ్మవద్దు. మేము ఇచ్చిన హామీలన్నింటినీ పూర్తిగా అమలు చేస్తాం. సంవత్సరం లోపు రూ. 300 కోట్లతో జిల్లాలో పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ ఓపెన్ చేస్తాం అన్నారు. పామ్ ఆయిలో రాష్ట్రంలో, దేశంలోనే సిద్దిపేట జిల్లా మొదటిస్థానంలో ఉండాలి. ఇతర దేశాల నుండి లక్ష కోట్లు పెట్టు ఆయిల్ కొంటున్నాము. ఇప్పటికే 11 వేల ఎకరాలు సాగు అవుతుంది. ఇంకా 11 వేల ఎకరాలకు పెంచాలి. భారత దేశానికి కావలసిన ఆయిల్ మొత్తం తెలంగాణ ఇస్తుందని రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి చెప్పారని మంత్రి తుమ్మల చెప్పుకొచ్చారు. రైతాంగానికి ఎక్కడ ఇబ్బంది వచ్చినా వారికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని మరోమంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు 1వ తేది నుండి అందుబాటులోకి వస్తాయి. గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ అనేక అబద్ధపు హామీలు ఇచ్చారు. నాటి ప్రభుత్వంలో ప్రజలను ఇబ్బందులకు గురి చేసే విధంగా రాచరికపు నిర్ణయాలు తీసుకున్నారు. శాసన సభ్యునీ హోదాలో ఇంత వరకు నియోజకవర్గంలో అడుగుపెట్టలేదు. బీజేపీ, బీఆర్ఎస్ రైతు వ్యతిరేఖ చట్టాలు తీసుకువచ్చాయి. దేశ ఆర్థిక వ్యవస్థకు రైతాంగం అండగా ఉంది. గత ప్రభుత్వం రైతాంగానికి ఇవ్వవలసిన పనిముట్లను వాళ్ళ కార్యకర్తలకు ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆ విధంగా కాకుండా చిన్న, సన్నకారు రైతులకే వ్యవసాయ పనిముట్లు అందజేస్తాం అని మంత్రి పొన్నం ప్రభాకర్ రైతులకు భరోసా ఇచ్చారు. బీఆర్ఎస్, బీజేపీలపై మంత్రి కొండా సురేఖ సంచలన ఆరోపణలు చేశారు. కవిత కోసం బీఆర్ఎస్, బీజేపీ మధ్య ఒప్పందాలు జరిగాయని.. అందుకే ఆమె బెయిల్‌పై బయటకు వచ్చారన్నారు. గజ్వేల్ ప్రజలు అనుకుంటే ఏదైనా సాధిస్తారని నమ్మకం ఉంది. మెదక్ ఎంపీ అభ్యర్థిగా బీజేపీని గెలిపించేందుకు బీఆర్ఎస్.. బీజేపీతో చీకటి ఒప్పందం చేసుకుంది. ఎంపీలుగా బీజేపీని గెలిపిస్తామని, కవితని వదిలిపెట్టాలని ముందే అమిత్ షాతో ఒప్పందం చేసుకున్నారు. ప్రజలకు ఏ విధంగా సేవ చేయాలా అని మేము చూస్తుంటే.. బీఆర్ఎస్ పార్టీ మాత్రం ప్రజలను తప్పు దారి పట్టిస్తోంది. సోషల్ మీడియా ద్వారా తప్పుడు వార్తలు, రాతలు రాపిస్తూ కేటీఆర్ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారు. ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇవ్వాల్సిన ప్రతిపక్షం ఇంతవరకు నియోజకవర్గంలో కానీ, అసెంబ్లీలో కానీ అడుగుపెట్టలేదు. గజ్వేల్ ఎమ్మెల్యే ఉన్నాడా లేడా అనేది ప్రశ్నగా ఉంది. ప్రభుత్వానికి సూచనలు ఇవ్వాలి కానీ అడ్డుపడితే ఊరుకునేది లేదని అంటూ విపక్షాలకు మంత్రి మాస్ వార్నింగ్ ఇచ్చారు.

## వైభవంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



ఎల్కతుర్తి అక్టోబర్ 3 ప్రజా మంటలు


ఎల్కతుర్తి మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం రోజున దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి ఆంజనేయ స్వామి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించడంతోపాటు అభిషేకాలు పూజలు నిర్వహిస్తున్నారు అమ్మవారి విగ్రహం దాత కొమ్మిడి పెర్మాల్ రెడ్డి యూత్ ఆధ్వర్యంలో అమ్మవారి విగ్రహమును ప్రతిష్టించి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ మెంబర్లు గ్రామ ప్రజలు భక్తులు తదితరులు పాల్గొన్నారు



# వరిధాన్యం సేకరణలో సన్నబియ్యానికి క్వింటాల్ కు అదనంగా 500 రూ. లు బోనస్

- ప్రతి కొనుగోలు కేంద్రానికి ఒక సీరియల్ నెంబర్‌ను కేటాయించాలి
- గన్ని బ్యాగులు, టార్పలిన్లను అందుబాటులో ఉంచుకోవాలి
- కొనుగోలు సమస్యలు తెలిపేందుకు 24 X7 టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలి
- దసరాలోగా టీచర్ల పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు
- వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి





జగిత్యాల అక్టోబర్ 03 (ప్రజామంటలు):

ఖరీఫ్ 2024-25 వరిధాన్యం కొనుగోలుకి సంబంధించి, డీఎస్సీ సర్టిఫికెట్ వెరిఫికేషన్, నియామకం ఆర్డర్ల గురించి హైదరాబాద్ లోని సచివాలయం నుండి రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి, సి. ఎస్. శాంతి కుమారి, డిజిపి, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.... వరిధాన్యం సేకరణలో సన్నబియ్యానికి అదనంగా క్వింటాల్ కు 500 రూపాయల బోనస్ ఇవ్వనున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలు సంబంధించి జిల్లాలో పటిష్ట కార్యాచరణ తీసుకోవాలని అన్నారు. 7 వేల పైగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు రాష్ట్ర స్థాయిలో ఏర్పాటు చేసుకుంటున్నామని అన్నారు. గతానికి భిన్నంగా ఈ సీజన్ నుంచి సన్న రకం, దొడ్డు రకం ధాన్యం కొనుగోలుకు వేర్వేరు కౌంటర్లు , కాంటాలు ఏర్పాటు చేయాలని సీఎం అన్నారు, కొనుగోలు కేంద్రంలో సరిపడా ప్యాడి క్లీనింగ్ మెషిన్స్ అందుబాటులో ఉంచాలని, టోకెన్ పద్ధతి పాటించాలని, రైతులకు సరిపడు టార్పాలిన్ కవర్స్ అందుబాటులో ఉంచాలని, ఏరోజుకు ఆ రోజు ధాన్యం నాణ్యత పరీక్షించి రికార్డులో నమోదు చేయాలనీ తెలిపారు. సన్నరకం మరియు దొడ్డు రకం వడ్లను గుర్తించుటకు గాను గ్రెయిన్ కాలిపర్స్ (సన్న వరి గుర్తింపు కోసం డయల్ మైక్రో మీటర్) ప్రతి కొనుగోలు కేంద్రాలలో అందుబాటులో ఉంచుకోవాలని అధికారులని ఆదేశించినారు. సన్నరకం మరియు దొడ్డు రకం వడ్లను గుర్తించే విషయంలో ఏ. ఈ. ఓ. లు జాగ్రతగా వ్యవహరించాలని ఆదేశించినారు. అవసరమైన చోట కొత్తగా ఐకేపీ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎలాంటి అవకతవకలు జరుగకుండా ఉంటాలంటే ఐకేపీ సెంటర్లకు సీరియల్ నెంబర్లను ఇవ్వాలని, అదే నెంబర్లను బియ్యం బస్తాల మీద వేయాలని, వీటి కోసం రెవెన్యూ సెక్రేటరీలను నియమించాలని ఆదేశించారు. గన్ని బ్యాగులు, టార్పలిన్లను అందుబాటులో ఉంచుకోవాలని, వర్షాకాలం అయినందున వర్షం పడే అవకాశం ఉన్నందున ఐకేపీ సెంటర్లలో ధాన్యం తడవకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వాతావరణ శాఖ నుంచి వచ్చే సూచనల ప్రకారం ఐకేపీ సెంటర్లలో రైతులకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. ఐకేపీ సెంటర్లలో త్రాగునీటి సౌకర్యం, వరిధాన్యం సేకరణలో జాప్యం జరిగితే రైతులు ఉండేందుకు వీలుగా కనీస వసతి కల్పించాలని, అలాగే కొనుగోలు చేసిన ధ్యానం వెంటనే తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలలో సన్న బియ్యం, దొడ్డు బియ్యం సేకరించే ప్రక్రియలో వేరువేరుగా నిల్వ ఉంచేలా జాగ్రత్తలు తీసుకోవాలని, లేనిచో అవకతవకలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. ఇందుకు సంబంధించి కలెక్టర్లు బాధ్యత వహించాలని 24 %ఇ% 7 కాల్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని, ఎక్కడ ఏ రైతుకు సమస్య వచ్చిన వెంటనే పరిష్కారం చేసే విధంగా కాల్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని అన్ని జిల్లాల కలెక్టర్లను ముఖ్యమంత్రి ఆదేశించారు. పక్క రాష్ట్రం నుండి ధాన్యం తెచ్చి ఇక్కడ అమ్మే అవకాశం ఉన్నందున పోలీస్ అధికారులు బార్డర్ ల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి చెక్ చేస్తుండాలని ఆదేశించారు. ప్రతిరోజు కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటనలు నిర్వహించి తరుగు, తేమ పేరుతో రైతులను మోసం చేసేవారిపై అవసరమైతే క్రిమినల్ కేసులు పెట్టాలని సిఎం ఆదేశించారు. 11,062 టీచర్ల భర్త కోసం డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసి విజయవంతంగా పరీక్షలు నిర్వహించి 1:3 క్రింద 25,239 మందిని ఎంపిక చేసి ఫలితాలు ప్రకటించామని, ఇప్పటి వరకు 9090 మాది అభ్యర్థులు సర్టిఫికెట్లు వెరిఫికేషన్ జరిగిందని అన్నారు. 2 రోజుల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేయాలని, అక్టోబర్ 9 సాయంత్రం 4 గంటలకు ఎంపికైన అభ్యర్థులకు అపాయింట్మెంట్ ఆర్డర్లు జారీ చేయాలని అన్నారు. దసరా కంటే ముందు టీచర్ల నియామకం పూర్తి కావాలని, జిల్లా కలెక్టర్లు దినిని ప్రాధాన్యత అంశంగా పూర్తి చేయాలని అన్నారు. రాష్ట్ర నీటిపారుదల పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రభుత్వానికి అత్యంత ప్రతిష్టాత్మకమని, ఏ చిన్న ఇబ్బంది లేకుండా సమర్థవంతంగా ధాన్యం కొనుగోలు జరిగేలా జిల్లా కలెక్టర్లు ప్రత్యేకంగా పర్యవేక్షించాలని అన్నారు. ప్రభుత్వం కొన్ని వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టిందని అన్నారు. దొడ్డు రకం ధాన్యానికి ప్రపంచంలో డిమాండ్ తగ్గిపోతుందని, కేంద్ర ప్రభుత్వం కూడా కొనుగోలు తగ్గించిందని అన్నారు. ప్రజలకు అందించే రేషన్ బియ్యం అక్రమ రవాణా, దుర్వినియోగాలను అరికట్టేందుకు జనవరి నుంచి సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని అన్నారు. సన్న రకం ధాన్యం సాగు ప్రోత్సహించేందుకు ప్రభుత్వం క్వింటాల్ 500 రూపాయల బోనస్ ప్రకటించిందని తెలిపారు. ప్రస్తుత ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ లో తెలంగాణ వ్యాప్తంగా 60 శాతం మేర సన్న రకం ధాన్యం సాగు చేశారని, ప్రభుత్వం 91 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు అంచనా తో చర్యలు తీసుకుంటుందని, దాదాపు 47 లక్షల మెట్రిక్ టన్నుల సన్న వడ్ల కొనుగోలు చేయబోతున్నామని అన్నారు. జిల్లా స్థాయిలో అవసరాల మేరకు నూతన కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన ప్యాడీ క్లీనర్, ఇతర సామాగ్రి వెంటనే యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేయాలని అన్నారు. దొడ్డు రకం ధాన్యం సన్న రకం కోనుగోలు కేంద్రాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ రావద్దని అన్నారు. మిల్లర్ల వద్ద ఎటువంటి ధాన్యం కోతలు జర్గవద్దని అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం భద్ర పరిచేందుకు అవసరమైన మేర ఇంటర్మీడియట్ గో డౌన్ సన్నద్ధం చేయాలని, ప్రతి జిల్లాలో ధాన్యం కొనుగోలు ఫోన్ నెంబర్ తో కూడిన గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయాలని అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 48 గంటల్లో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. పక్క రాష్ట్రాల ధాన్యం మన కొనుగోలు కేంద్రాలకు రాకుండా బార్డర్ల వద్ద చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. రాంబాబు, వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## టిజిటిఎస్ లోకి ధరణి ఉద్యోగులు

భీమదేవరపల్లి అక్టోబర్ 03 (ప్రజామంటలు):

ధరణి ఉద్యోగులకు భద్రత కల్పించాలని సీఎంఆర్ఓ ప్రాజెక్ట్ డైరెక్టర్, టిజిటిఏ అధ్యక్షులు లచ్చిరెడ్డిని కోరిన వెంటనే సానుకూలంగా స్పందించినట్లు భీమదేవరపల్లి ఎమ్మార్వో ఆఫీస్ కంప్యూటర్ ఆపరేటర్ సాయి తెలిపారు. హనుమకొండ, వరంగల్, భూపాల్ పల్లి, ములుగు జిల్లాల ధరణి ఉద్యోగులందరూ గత ఏడు నెలలుగా జీతాలు రావడం లేదని, ధరణి ఉద్యోగుల భద్రత కల్పించాలని కోరిన వెంటనే సానుకూలంగా స్పందించి టి.జి.టి.ఎస్. ఆధ్వర్యంలోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ధరణి ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి గోళ్ల నాగరాజు, హనుమకొండ జిల్లా ధరణి ఉద్యోగుల సంఘం కోశాధికారి మంచాల సాయిరాం, రఘుపతి రెడ్డి, వరంగల్ జిల్లా అధ్యక్షులు క్రాంతి, ఉపాధ్యక్షులు మహేందర్, భూపాలపల్లి జిల్లా నుండి వరుణ్, సంతోష్, ములుగు జిల్లా కోశాధికారి రజినీకాంత్, నరేష్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విద్యుత్ దీపాలు ప్రారంభం



మహాదేవపూర్ అక్టోబర్ 03 (ప్రజామంటలు):

ఐటీ, బారి పరిశ్రమల శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు సద్దుల బతుకమ్మ విజయదశమి సందర్భముగా మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక ప్రదాన చౌరస్తా స్వర్గీయ శ్రీపాదరావు విగ్రహాం వద్ద ఉన్న కరెంట్ స్విచ్ ఆన్ చేసి స్ట్రీట్ లైట్స్ ను పాక్స్ చైర్మన్ సల్ల తిరుపతి రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కోట రాజబాబు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అక్బర్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు కటకం అశోక్, మాజీ ఎంపీటీసీలు ఆకుతోట సుధాకర్, మంచినీళ్ల దుర్గయ్య, మైనార్టీ అధ్యక్షులు ఏజాస్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వామన్ రావు, వెన్నపురెడ్డి శ్రీనివాస్ రెడ్డి, అశ్రర్ ఖురేషి, కోట సమ్మయ్య, కడార్ల నాగరాజు, ధగాం సంతోష్, రాఘవేంద్ర, హరీష్, కృష్ణమోహన్, రాఫ్, చేకూర్తి రాజబాబు, మురహరి రాజేందర్, మాజీ సర్పంచులు మండల యూత్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు, ఎస్ సి, ఎస్ టీ, బిసి, మైనార్టీ సెల్ నాయకులు పాల్గొన్నారు.



## ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జ్ఞాన ప్రదేశంగా నిర్ణయించి నామకరణ చేయాలి

ఎల్కతుర్తి అక్టోబర్ 03 (ప్రజామంటలు):

ఎల్కతుర్తి మండల కేంద్రంలో ప్రపంచ మేధావి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి జ్ఞాన ప్రదేశంగా నిర్ణయించి నామకరణ చేసినారు స్థలములో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి విగ్రహంతో పాటు మహనీయుల విగ్రహాలు నిర్మించుకుంటామని మండలంలోని దళిత నాయకులు ఏర్పాటు చేసుకున్న స్థలములో గత కొంత కాలంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరణ ముందు అందులో రావణ వధ కార్యక్రమాలు నిర్వహించారు అంబేద్కర్ ఇజంకు వ్యతిరేకంగా కొంతమంది ఆ యొక్క ప్రాంగణాన్ని స్వాధీనం చేసుకుని ఇజంకు వ్యతిరేకంగా సంఘ విద్రోహ చర్యలు పాల్పడుతున్నారు ఇట్టి కార్యక్రమాలను గత మూడు సంవత్సరాల నుండి అనేక సంఘములు కలిసి అడ్డుకోవడం జరిగినది అప్పుడున్న ఎమ్మెల్యే గారి ప్రోత్సాహంతో కార్యక్రమాలు నిర్వహించారు ఇలాంటి జ్ఞాన తల సేకరణ కోసం అనేక సంఘాలు పాల్పడ్డాయి ఇప్పుడున్న హుస్నాబాద్ స్థానిక మంత్రివర్యులు దీన్ని గుర్తించి ఈ కార్యక్రమానికి వెంటనే అంబేద్కర్ గారి విగ్రహం పక్కన నిలిపివేసి తగిన స్థలాన్ని వారికి సూచించాలని డిమాండ్ లేకుంటే మండలంలోని అన్ని సంఘాలను ఏర్పాటు చేసి జేఏసీగా ఏర్పడి ఈ కార్యక్రమాన్ని అడ్డుకుంటామని హెచ్చరించారు ఈరోజు ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షులు అంబాల ఆర్య రాజు తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మేకల చేరాలు, గొర్రె తామస్ సాతురి రాజమౌళి, ఎర్ర ప్రకాష్,మేకల అశోక్, మారుపాక రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

## అంతర్గాం ఒడ్డెర కాలని డిజిటల్ ఫ్యామిలీ హెల్త్ కార్డుల సర్వేలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్

జగిత్యాల అక్టోబర్ 03 (ప్రజామంటలు):



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా చేపట్టిన డిజిటల్ హెల్త్ కార్డుల సర్వే లో భాగంగా జిల్లాలో మొదటి గ్రామంగా ఎంపిక చేయబడ్డ ఒడ్డెర కాలనిలో సర్వేలో అధికారులతో కలిసి కలెక్టర్ స్వయంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిజిటల్ ఫ్యామిలీ హెల్త్ కార్డులకు కుటుంబ వివరాలు పక్కాగా నమోదు చేయాలని తెలిపారు. అనంతరం ఇండ్లలో పరిశీలిస్తూ కుటుంబం నిర్ధారణ వివరాల నమోదు ప్రక్రియను వేగవంతంగా తప్పులు లేకుండా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో, ఆర్డీవో మధుసూదన్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వేలేర్ మండలం ఎర్రబెల్లి గ్రామంలో ఘనంగా బోనాలు గ్రామస్తులు ఘనంగా నిర్వహించుకున్నదుర్గమ్మ తిరుగు సంవత్సరం

## ఈనెల 5న అవుట్సోర్సింగ్ ఉద్యోగాల దరఖాస్తుల వెరిఫికేషన్

జగిత్యాల అక్టోబర్ 03 (ప్రజామంటలు):

సఖి వన్ స్టాప్ సెంటర్లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలకు సెంట్రల్ అడ్మినిస్ట్రేటర్ పోస్టుకు 42 అప్లికేషన్లు, కేస్ వర్కర్ కి 65 మరియు సెక్యూరిటీ లేదా నైట్ గార్డ్ 32 అప్లికేషన్లు వచ్చినవి, దీనికి సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఈనెల ఐదో తారీకు నాడు జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో రూమ్ నంబర్స్ 7, ఐ డి ఓ సి జగిత్యాల కలెక్టరేట్ నందు వెరిఫై చేయడం జరుగుతుంది మరియు ఎలిజిబుల్ / ఇన్ ఎలిజిబుల్ లిస్ట్ 15వ తారీకు మరియు అభ్యంతరాల స్వీకరణ ఎలిజిబుల్ మీద 16వ తారీకు స్వీకరించడం జరుగుతుంది. ఇంటర్వ్యూలకు అర్హులైన వారి యొక్క వివరాలను 17వ తారీఖు నాడు మరియు దీనికి సంబంధించిన ఇంటర్వ్యూలు 21 తారీకు మరియు తుది ఫలితాలను 23 వ తారీకు విడుదల చేయబడునని జిల్లా సంక్షేమ అధికారి డా. బోనగిరి నరేష్ తెలిపారు.

## ఎవరిపైనా వ్యక్తిగత కక్ష లేదు

- నా వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నాను
- వివాదం ముదరడంతో వెనక్కి తగ్గిన కొండా సురేఖ
- బేషరతుగా క్షమాపణలు కోరుతూ ప్రకటన

వరంగల్ (ప్రజామంటలు):

మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు వివాదాస్పదమవుతున్న వేళ.. ఆమె ఓ మెట్టు దిగొచ్చారు. అక్కినేని, సమంత కుటుంబానికి బాధించడం తన ఉద్దేశం కాదని ఆమె అన్నారు. ఈ మేరకు సమంత ఎక్స్ పోస్ట్‌కు మంత్రి సమాధానం ఇచ్చారు. సినీ రంగంలో సమంత ఎదిగిన తీరు తనకు ఆదర్శమన్నారు. 'మహిళా నాయకుల పట్ల ఓ నాయకుడి చిన్నచూపు ధోరణి ప్రశ్నించాలన్నదే నా ఉద్దేశం. మీ మనోభావాలు దెబ్బ తీయాలని కాదు. స్వశక్తితో మీరు ఎదిగిన తీరు నాకు ఆదర్శం. మీరు కానీ, మీ అభిమానులు కానీ మనస్తాపానికి గురైతే నా వ్యాఖ్యలను ఉప సంహరించుకుంటున్నా. క్షమించండి' అంటూ సమంతకు ఎక్స్‌లో రీపోస్ట్ చేశారు. భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తనపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడంతో భావోద్వేగానికి గురైనట్లు మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఆయనపై విమర్శలు చేసే క్రమంలో అనుకోకుండా ఓ కుటుంబాన్ని ప్రస్తావించినట్లు చెప్పారు. హనుమకొండలో ఆమె మీడియాతో మాట్లాడారు. తనకు ఎవరిమీద వ్యక్తిగత ద్వేషం లేదన్నారు. ఆ కుటుంబ సభ్యులు పెట్టిన పోస్టు చూసి చాలా బాధపడినట్లు తెలిపారు. ఏ విషయంలో నేను బాధపడ్డానో.. ఆ విషయంలో మరొకరిని నొప్పించా నని తెలిసి వ్యాఖ్యలను బేషరతుగా ఉపసంహరించుకున్నాను. నేను పడిన బాధ వేరేవాళ్లు పడకూడదని ఈ నిర్ణయం తీసుకున్నాను. అప్పుడే దీనిపై స్పందిస్తూ ఎక్స్‌లో పోస్టు చేశాను. కేటీఆర్ విషయంలో మాత్రం తగ్గేది లేదు.. ఆయన క్షమాపణ చెప్పాల్సిందే. ఆయనే చేసిందంతా చేసి నన్ను క్షమాపణ చెప్పమనడం.. దొంగే.. దొంగా దొంగా అన్నట్లుగా ఉంది. కేటీఆర్ లీగల్ నోటీసుపై న్యాయపరంగా ముందుకెళ్తాం అని కొండా సురేఖ తెలిపారు. మాజీ మంత్రి కేటీఆర్‌ని ఉద్దేశిస్తూ అక్కినేని ఫ్యామిలీతో ముడిపెడితూ.. కొండా సురేఖ సమంత విడాకుల గురించి మాట్లాడిన విషయం తెలిసిందే. కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలను కింగ్ నాగార్జున తీవ్రంగా ఖండిస్తూ.. అబద్దాలుగా కొట్టిపారేశారు. తాజాగా సమంత కూడా ఇన్‌స్టా వేదికగా మంత్రికి సమాధానమిచ్చింది. దీనికితోడు సినీ పరిశ్రమకు చెందిన వారంతా నిలదీయడంతో కొండా సురేఖ నాలుక కరచుకున్నారు. బేషరతుగా క్షమాపణలు వేడుకున్నారు.

## ఓటర్ల తుది జాబితా విడుదల

- స్థానిక పోరుకు ఎన్నికల కమిషన్ సంసిద్ధత

హైదరాబాద్, (ప్రజా మంటలు):

పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల తుది జాబితాను ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. రాష్ట్రంలోని 33 జిల్లాల పరిధిలో 12,867 పంచాయ తీల్లో 1,67,33,584 మంది ఓటర్లున్నట్టు తెలిపింది. ఇందులో 82,04,518 పురుషులు, 85,28,573 మహిళలు, 493 ఇతరులు ఉన్నారని పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో పురుషుల కన్నా మహిళలే అత్యధికంగా ఉన్నట్టు ఈసీ గణాంకాలు చెబుతున్నాయి. ఇదిలా ఉండగా.. రాష్ట్ర ప్రభుత్వం వార్డులు, పంచాయతీల రిజర్వేషన్ అంశంపై నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నది. రిజర్వేషన్ల పక్రియ కొలిక్కి వస్తేనే ఎన్నికల నిర్వహణకు అడుగులు ముందుకు పడే అవకాశం ఉంది. కులగణన పూర్తి చేసిన తరువాతే రిజర్వేషన్లు ప్రకటించి ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. దీంతో కులగణన పూర్తయి, రిజర్వేషన్లు ఖరారయ్యాకే ఎన్నికలు జరగనున్నాయి.

# ప్రజా సేవలో మేటి... రారెవరూ రత్నాకరునికి సాటి

## అక్టోబర్ 4...జువ్వాడి రత్నాకర్ రావు జయంతి



రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

ఆరుపదుల రాజకీయ ప్రస్థానంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సుస్థిరం చేసుకుని, ౯౦ కి పైగా వసంతాలను చూసిన, కరీంనగర్ కాంగ్రెస్ దిగ్గజం, రాజకీయ కురువృద్ధుడు, మాజీ అమాత్యులు రత్నాకర్ రావు ప్రజాసేవలో మేటిగా పేరు గడించారు . ధర్మపురి మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో ౧౯౨౮ అక్టోబర్ 4వ తేదీన జన్మించిన జువ్వాడి రత్నాకర్ రావు, చిరకాలం తిమ్మాపూర్ సర్పంచ్ గా, జగిత్యాల పంచాయతీ సమితి అధ్యక్షులుగా, ఆచార్య ఎన్.జీ.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పాలకవర్గం సభ్యులుగా, ధర్మపురి దేవస్థానం చైర్మన్ గా, ధర్మపురి ప్రాచ్య డిగ్రీ కళాశాల పాలక వర్గ అధ్యక్షులుగా, బుగ్గారం నియోజకవర్గానికి మూడు సార్లు శాసన సభ్యులుగా, పీసీసీ కార్యనిర్వాహక కార్యదర్శిగా ఏఐసిసి సభ్యుడిగా, రాష్ట్ర దేవాదాయ స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖ మంత్రిగా పనిచేసి, చేపట్టిన అన్ని పదవులకు వన్నె తెచ్చి, అవిశ్రాంత ప్రజా సేవకునిగా జన హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్నారు. ౧౯౮౫ జరిగిన ఎన్నికల్లో టిడిపి, కాంగ్రెస్ ను, కాదని బుగ్గారం నియోజకవర్గ ఓటర్లు స్వతంత్ర అభ్యర్థిగా జువ్వాడి రత్నాకర్ రావును గెలిపించి రాష్ట్రంలో సంచలనం సృష్టించారు. ౧౯౯4లో మినహా యించి రత్నాకర్రావు ౧౯౯౯లో మరియు 2004లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఘన విజయాలు సాధించారు. చివరిసారిగా రాజశేఖర్ రెడ్డి హయాంలో రత్నాకర్ రావు మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు.

"జిల్లా రాజకీయాలలో చెరగని ముద్ర"

అర్ధ శతాబ్దికి పైగా రాజకీయ యవనికపై ప్రత్యేక పాత్రధారిగా నిలిచిన రత్నాకర్ రావు, అవిభక్త కరీంనగర్ జిల్లా రాజకీయాలపై చెరగని ముద్ర వేశారు. కాంగ్రెస్ అధిష్టానంతో సన్నిహిత సంబంధాలు కలిగి, తలపండిన రాజకీయ నేతగా, రాష్ట్ర ముఖ్య మంత్రులకు సన్నిహితంగా ఉంటూ, జిల్లా రాజకీయాల్లో ప్రత్యేక పాత్ర పోషించారు. కరీంనగర్ ఎం.పి లుగా రమాపతిరావు, చొక్కారావు, సత్యనారాయణ రావు తదితరుల ఎన్నికలలో ఈ ప్రాంతం నుండి మెజారిటీ ఓట్లు అందించి, విజయాలకు ఎంతో కృషి జరిపారు. తనకు ముఖ్య అనుచరులైన ఆది శ్రీనివాస్ ను వేములవాడ దేవస్థానం చైర్మన్ గా, కొండూరి రవీందర్రావును జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ గా , తన మద్దతు కోరిన రాష్ట్ర మార్కెఫెడ్ చైర్మన్ గా పొన్నం ప్రభాకర్ తదితరుల నియామకాలలో, ఎన్నికలలో తెరవెనుక ప్రధాన సూత్రధారిగా ఉండి, తన కుమారుడైన నర్సింగరావు ఏపీఐఐసి డైరెక్టర్ గా ఉన్న స్థితిలో, పలు క్యాంపుల నిర్వహణ బాధ్యతలు తనయుడికి అప్పగించి, ఉమ్మడి జిల్లాలో తన బలాన్ని, బలగాన్ని, రాజకీయ కురువృద్ధ పాత్రలో, తన పట్టును నిరూపించుకో గలిగారు. అలాగే దశాబ్దాల కాలం రాజకీయ రంగంలో తనను వెన్నంటి ఉండి కష్ట సుఖాలలో విడవకుండా ఉన్న సారంగాపూర్ మండలానికి చెందిన వరిష్ఠ నేత కొండ మల్లారెడ్డిని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదాధికారిని చేయడంలో రాజకీయం నెరపి, ఇతర శాసన సభ్యుల ఆమోదం ముద్రలతో, విజయం సాధించ గలిగారు. ధర్మపురి మండలం దోనూర్ వాసి న్యాయవాది లక్ష్మణ్ ను జనరల్ స్థానంలో ఎంపీటీసీగా గెలిపించి ధర్మపురి మండల అధ్యక్షుడిగా చేశారు. తనను ఎల్లకాలం వెన్నంటి ఉన్న రాజారం వాసి, ధర్మపురి మండలం సీనియర్ నేత సొల్లు భీమయ్యకు వైస్ ఎంపీపీ, ఎంపీపీ, జెడ్. పి. టి. సి, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పదవులు ఇప్పించి నమ్మిన బంటుకు చేయూత అందించారు. పులి శెట్టి మల్లేశంను మార్కెట్ కమిటీ చైర్మన్ గా, అప్పాల లింగన్న ను ఎస్సారెస్పీ ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ గా, అలాగే చిరకాలం విశ్వసనీయునిగా ఉన్న ధర్మపురి వాసి సంగన భట్ల దినేశ్ ను, వర్తక సంఘం నేత అక్కనపెల్లి రాజేందర్ ను ధర్మపురి దేవస్థానం చైర్మన్ లుగా చేశారు. ఇలా ఒక్కటేమిటి, ఎందరికో న్యాయం చేకూర్చారు. తనను విశ్వసించిన, పార్టీకి సేవలందించిన వ్యక్తులకు అవకాశాలను బట్టి వివిధ పదవులను ఇప్పించడంలో సఫలీకృతులయ్యారు.

"అవినీతికి దూరం... నిజాయితీ బలం"

సర్పంచ్ నుండి రాష్ట్ర అమాత్య పదవులు పొందడం వెనక అవినీతి రహిత, రత్నాకర్ రావు మచ్చ లేని, నిజాయితీకి ప్రతిరూపమైన, ఆయన వ్యక్తిత్వమే కారణం. పార్టీ టికెట్ రాని నేపథ్యంలో, ౧౯౮౫లో స్వతంత్ర అభ్యర్థిగా జువ్వాడి రత్నాకర్ నామినేషన్ దాఖలు




చేయాలని శ్రేయోభిలాషులు పట్టు బట్టిన సమయంలో "ప్రస్తుతం డిపాజిట్ డబ్బులు లేవు కదా" అనడాన్ని బట్టి ఆయన పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. (ఇక్కడ పార్టీ టికెట్ వస్తే పార్టీ ఫండ్ తో పాటు, అభిమానుల చందాలు వస్తాయని భావం). జగిత్యాల పంచాయితీ సమితి అధ్యక్షునిగా పదవీ విరమణ చేసిన సందర్భంలో, కొండ్ర మల్లారెడ్డి నేతృత్వంలో, ౯౦ మందికి పైగా సర్పంచులు స్వచ్ఛందంగా భాగస్వాములై, ఒక కొత్త అంబాసిడర్ కారు కొని, బహూకరించిన వేళ..."నాకు ముందే ఎందుకు చెప్పలేదు. కారు కొనిచ్చినా, రేపటి నుండి పెట్రోల్ ఎలా పోసుకోవాలి, ప్రేమతో ఇస్తున్న కానుకను ఉపయోగించ లేను. విక్రయించనూ లేను" అని బాధను వ్యక్తం చేయడం ద్వారా రత్నాకర్ రావు అపూర్వ, అనితర, స్ఫూర్తి దాయక, ఆదర్శ వ్యక్తిత్వం ద్యోతకమవుతుంది. 2020 మే 10న రత్నాకర్ రావు మృతి చెందారు. తెరాస సీనియర్ నేత, ధర్మపురి శాసన సభ స్థానానికి ప్రాతినిధ్యం వహించిన తాజా మాజీ రాష్ట్ర సంక్షేమ శాఖల మంత్రి కొప్పుల ఈశ్వర్... ధర్మపురి క్షేత్రంలో స్వంత ఖర్చుతో కాంగ్రెస్ వరిష్ఠ నేత రత్నాకర్ రావు సంబంధిత 7.6మీటర్ల ఎత్తు గల భారీ విగ్రహాన్ని నేషనల్ హైవే పక్కన ఏర్పాటు చేసి, ఆవిష్కరించడం విశేషం.

# గాజా అగ్రనేత రావీ ముష్తాహా మృతి

**- దాడుల్లో మరణించినట్లు ప్రకటించిన ఐడీఎఫ్**

గాజాస్ట్రిప్ (ప్రజామంటలు): గాజా పట్టీలో హమాస్ తరపున అప్రకటిత ప్రధానిగా వ్యవహరించిన రావీ ముష్తాహా మృతి చెందినట్లు ఇజ్రాయెల్ భద్రతా దళాలు ప్రకటించాయి.కొన్ని నెలల క్రితమే తాము జరిపిన దాడుల్లో అతడు చనిపోయినట్లు ఐడీఎఫ్, షిన్‌బెట్ తాజాగా ప్రకటించాయి.ముష్తాహాను లక్ష్యంగా చేసుకొని ఐడీఎఫ్ దళాలు మూడు నెలల క్రితం గాజా పట్టీలో దాడి చేశాయి. ఆ సమయంలో అతడితోపాటు హమాస్ పొలిటికల్ బ్యూరో సీనియర్‌నాయకుడు సమీ అల్ సిరాజ్, జనరల్ సెక్యూరిటీ చీఫ్ సమి ఒదేహ్ ఉన్నారు. ఆ దాడిలో వారు ముగ్గురు చనిపోయినట్లు తాజాగా ఐడీఫ్‌కు ధ్రువీకరణ లభించింది.వీరంతా సొరంగాల్లో నక్కిన సమయంలో ఇజ్రాయెల్ దళాలకు కచ్చితమైన ఇంటెలిజెన్స్ లభించింది. దీంతో ఫైటర్ జెట్ల సాయంతో ఈ ఆపరేషన్ నిర్వహించాయి. ఈ సొరంగ మార్గం నాడు హమాస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌గా, సీనియర్ హమాస్‌నేతలు దీర్ఘకాలం తలదాచుకోవడానికి వీలుగా నిర్మించారు.మరోవైపు హమాస్ మాత్రం వీరి మరణాలను ఇప్పటి వరకు ధ్రువీకరించలేదు. దీంతో ఆ మిలిటెంట్ సంస్థ కేడర్ నైతిక స్థైర్యం దెబ్బతినకుండా నష్టాలను దాస్తోందని ఇజ్రాయెల్ భావిస్తోంది. వాస్తవానికి రావీ ముష్తాహా హమాస్ చీఫ్ యాహ్యా సిన్వార్‌కు రైట్‌హ్యాండ్‌గా భావిస్తారు. వీరిద్దరు కలిసి ఇజ్రాయెల్ జైల్లో సుదీర్ఘకాలం ఉన్నారు. ఆ తర్వాత వీరే హమాస్ జనరల్ సెక్యూరిటీ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఈ యుద్ధ సమయంలో గాజాలో ప్రజలను నియంత్రించడంలో ముష్తాహానే కీలక పాత్ర పోషించినట్లు ఇజ్రాయెల్ గుర్తించింది. ఈ దెబ్బతో హమాస్ దళాల మోహరింపులో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుందని భావిస్తున్నారు. దీంతో హమాస్ ప్రధాన నాయకత్వం తుడిచిపెట్టుకుపోయిందని భావిస్తున్నారు. ఇప్పటికే యాహ్యా సిన్వార్ జాడ లేకుండా పోయిన విషయం తెలిసిందే.

# పేదలపై దౌర్జన్యం సరికాదు

**- హైడ్రా పేరుతో కూల్చివేతలు ఆపాలి**

**- సీఎంకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విజ్ఞప్తి**



హైదరాబాద్, (ప్రజా మంటలు): పేదలపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రతాపం చూపుతున్నారని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. హైడ్రా పేరుతో కూల్చివేతలు ఆపాలని సీఎంకు విజ్ఞప్తి చేశామన్నారు. నాంపల్లిలోని భాజపా కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు."గతంలో భారాస ప్రభుత్వం.. మూసీ సుందరీకరణ చేయాలని ఆలోచించింది. ప్రజల నుంచి వ్యతిరేకత రాగానే వెనక్కి తగ్గింది. డ్రైనేజీ సమస్య పరిష్కరించకుండానే మూసీ సుందరీకరణ చేయాలని చూస్తున్నారు. తాగునీరు, డ్రైనేజీ కలిసి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూల్చవద్దని ప్రభుత్వాన్ని కోరాం. విధ్వంసాన్ని ఆపాలని సీఎంకు లేఖ రాశాను. ప్రజల ఆవేదనను పరిగణనలోకి తీసుకోకుండా వ్యవహరించడం న్యాయం కాదు" అని కిషన్‌రెడ్డి అన్నారు.మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలపై మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా కిషన్‌రెడ్డి స్పందించారు. ఆమె వ్యాఖ్యలను ఖండించారు. మహిళలు, కుటుంబాల గురించి మాట్లాడటం భారాస, కాంగ్రెస్ పార్టీలకు అలవాటైందని విమర్శించారు.

## నవరాత్రుల్లో..

మనిషిలోనిజి
కామక్రోధాలను తొలగించే
ఆధ్యాత్మికమార్గం దేవీనవరాత్రులు.

ఆశ్వయుజ మాసాన,
నవరాత్రి వేడుకలలో,
అమ్మ చల్లనైన
కరుణాకటాక్ష వీక్షణప్రభలతో
ఆధ్యాత్మికత దీపించును, దివ్యతేజమై.

జగతికి ప్రాణాధారమై,చైతన్యదీపమై,
సకల జగాలనూ లాలించి పాలిస్తూ,
సమస్త జీవకోటికీ శుభాలనొసగే
జగన్మాత, కోటికాంతులతో
దేదీప్యమానంగా అలరారుతుంది
ఈరోజుల్లో.
శరచ్చంద్రికల అందాలనాస్వాదిస్తూ,
జగతిని అనుగ్రహిస్తుంది దరహాసా
మృతపూర్ణవదనయై.

-వేమూరి శ్రీనివాస్
తాడేపల్లిగూడెం,
9912128967

# సిరియా ఆయుధాగారంపై ఇజ్రాయెల్ దాడి

న్యూఢిల్లీ, (ప్రజామంటలు): తన దేశానికి ముప్పు పొంచి ఉందని భావించిన ప్రతి లక్ష్యంపై ఇజ్రాయెల్ వరుస దాడులు చేస్తోంది. గాజా, లెబనాన్, సిరియాలోని తన శత్రువులను మట్టుపెడుతోంది.గురువారం సిరియా పశ్చిమతీరంలోని ఆయుధ డిపోపై బాంబుల వర్షం కురిపించిందని సమాచారం. హెజ్‌బొల్లాకు అధునాతన ఆయుధాల బదిలీని అడ్డుకోవడమే ఈ ఆపరేషన్ లక్ష్యమని ఇజ్రాయెల్ సైనిక వర్గాలు తెలిపాయి.బెంజమిన్ నెతన్యాహు ప్రభుత్వం హెజ్‌బొల్లా గ్రూప్‌పై వరుస దాడులు చేస్తూ అగ్ర కమాండర్లను హతమారుస్తోంది. ఆ గ్రూప్ చీఫ్ హసన్ నస్రల్లా కూడా ప్రాణాలు కోల్పోయారు. ఇలా వరుసగా



దెబ్బతీస్తున్నప్పటికీ.. హెజ్‌బొల్లా ప్రతిదాడులు చేస్తూనే ఉంది. దాంతో దాని ఆయుధాల సరఫరాను దెబ్బతీసే లక్ష్యంతో ఈ డిపోను టార్గెట్ చేసినట్లు సమాచారం. సిరియా తీరప్రాంత నగరాలపై జరిగిన దాడికి సంబంధించిన చిత్రాలు కొన్ని వెలుగులోకి వచ్చాయి.

# మహానగరంలో మాయగాళ్లు !



అంతర్జాతీయ నగరంగా పేరుగాంచిన హైదరాబాద్ ప్రభ మసక బారుతోంది. ఉన్ననగరంలో కనీస వసతులు, మంచినీటి సమస్య తీరడం లేదు. హైదరాబాద్ నగరాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతామన్న పాలకుల హామీలు నెరవేరడంలేదు. ప్రధానం గా డ్రైనేజీ, ట్రాఫిక్ సమస్యలు ఎక్కడికక్కడే నిలదీస్తున్నాయి. నగరం చారిత్రకంగా ఎంతో భాసిల్లింది. ఇక్కడ తరతమ భేదం లేకుండా అన్ని వర్గాల ప్రజలు జీవిస్తున్నారు. ఎక్కడెక్కడి నుంచో వచ్చి ఇక్కడే స్థిరపడ్డారు. హైదరాబాద్‌కు ప్రపంచ వ్యాప్తంగానే ఓ బ్రాండ్ ఇమేజ్ ఉంది. హైదరాబాద్‌కు మరింత శోభ తెస్తామని, సమస్యలు లేకుండా చేస్తామని గత బిఆర్ఎస్ ప్రభుత్వం పదేపదే ప్రకటించినా అడుగు పడలేదు. ఇష్టం వచ్చినట్లుగా లేఔట్లు వేసి, చెరువులను కబ్జాచేసిన పాపానికి ఫలితం అనుబస్తున్నాం. గతంలోనే సిఎం కెసిఆర్ కఠిన నిర్ణయం మేరకు ఆక్రమణల తొలగించి,నగరాన్ని అద్భుతంగా తీర్చిదిద్ది వుంటే ప్రజలు జేజేలు పలికేవారు. ప్రజలు ట్రాఫిక్ కష్టాలు పడుతున్నా పట్టించుకున్న పాపాన పోలేదు. నగరంలో అడ్డదిడ్డంగా కట్టడాలకు, ఆక్రమణలకు, నాలాలను ఆక్రమణలకు బాధ్యులైన గత అధికారులు, బిల్డర్లు, రియల్టర్లపై చర్యలు తీసుకుంటే కొంత భయం ఉండేది. ఇష్టారాజ్యంగా కట్టడాలు వెలిసినా పట్టించుకోలేదు. కెసిఆర్ పగ్గాలుచేపట్టిన తొలినాళ్లలో అయ్యప్ప సొసైటీలో కూల్చివేతలు, ఎన్ కన్వెన్షన్ ఆక్రమణలపై సిఎం కెసిఆర్ ఘాటుగా స్పందించి నగరాన్ని నవీకరిస్తామన్న హామీలు గుప్పించారు. కనీసం ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కూడా సక్రమంగా సాగలేదు. పదేళ్లలో నగరాభివృద్ధి విషయంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఎలాంటి చిత్తశుద్ధిని ప్రకటించలేదు. చెత్త ఎత్తిపోతలకు డబ్బులు పంచి అదే స్వచ్ఛభారత్ అన్న చందంగా ప్రచారం చేసుకుంది. మున్సిపల్ శాఖ మంత్రిగా కెటిఆర్ బాధ్యతలు నిర్వహించినా నగర సుందరీకరణ, ట్రాఫిక్ సమస్యల పరిష్కారం దక్కలేదు. చల్తీకా నామ్ గాడీ అన్నచందంగా హైదరాబాద్ సమస్యలను మోస్తూ ముందుకు సాగుతున్నది. ఇక్కడి ప్రజలు కూడా కష్టాలకు అలవాటు పడ్డారు. జిహెచ్ఎంసిలో వందసీట్లు గెల్చుకున్నామని జబ్బలు చరిచిన బిఆర్ఎస్ పార్టీ వారు ఏం చేశారని వెనక్కి తిరిగి చూస్తే ఏమీ లేదని కళ్లకు కనిపిస్తుంది. కేవలం ఓట్లు..సీట్లు తప్ప నగర అభివృద్ధి ప్రణాళిక అన్నది లేకుండా పోయింది. అయితే రియల్టర్ల పాపానికి ప్రజలు బలవుతున్నారు. ఎప్పుడు వర్షాలు పడ్డా భారీ వర్షాల దెబ్బకుచెన్నై, ముంబయి, ఢిల్లీ వంటి మహా నగరాలు కుదేలయ్యాయని మాత్రమే విన్నాం. నాలుగేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు వర్ష నీటి ప్రవాహాలకు నాలాలెన్నో పొంగాయి. అవన్నీ అక్రమ నిర్మాణాల బారిన పడడంతో రాజధాని నీటమునగడానికి కారణభూతమైంది. అందుకే హైదరాబాద్‌లో గుర్తించిన అక్రమ కట్టడాలను కూల్చివేయడం, నాలాల ఆక్రమణలను తొలగించడం కోసం నాటి సిఎం కెసిఆర్ గతంలో ఆర్భాట ప్రకటనలు చేసినా... అవి అక్కడితోనే ఆగిపోయాయి. తీసుకున్న నిర్ణయాలు పక్కాగా అమలు కావడానికి చిత్తశుద్ధి ప్రకటించలేదు. హైదరాబాద్‌ను ఓ రకంగా గూండాలు ఆక్రమించుకుని తమ రియల్ వ్యాపారంతో సర్వనాశనం చేశారు. ఇక్కడి భూములను ఆక్రమించుకుని అడ్డదిడ్డంగా ఇళ్లు కట్టి సొమ్ము చేసుకున్నారు. హైటెక్ సిటీ ఎంత డొల్లగా నిర్మితమయ్యిందో డ్రైనేజీ వ్యవస్థను చూస్తే అర్థం అవుతుంది. రాజకీయ నాయకుల ఆక్రమణల వల్లనే ఇవాళ నగరం అస్తవ్యస్తంగా తయారయ్యింది. ఇంకా అక్రమ కట్టడాలు, చెరువుల ఆక్రమణలు కనిపిస్తున్నా కఠిన చర్యలకు ఉపక్రమించిన దాఖలాలు లేవు. అడపాదడపా కొన్నిచోట్ల ఆక్రమణ కూల్చివేత తప్ప చేసిందేమీ లేదు. ఇంకా అక్కడక్కడా చెరువులను ఆక్రమిస్తూనే ఉన్నారు. గతంలో బండారి లే అవుట్‌లో వర్షాలకు ప్రజలు ఎంతగా ఇబ్బందులు పడ్డారో గమనించాం. తాజాగా మూసీ సుందరకీరణ కావచ్చు...ఆక్రమణల కూల్చివేతలు కావచ్చు కాంగ్రెస్ ప్రభుత్వం కఠినంగానే వ్యవహరిస్తోంది. అయితే ఇది సామాన్యులకు పెద్ద దెబ్బగా మారింది. ఏళ్ల నుంచి మూసీ పరివాహకంలో వీరంతా సెటిల్ అయ్యారు. మరోమారు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలకు పూనుకుంటారని భావించినా చిత్తశుద్ధి కానరాలేదు. అంతెందుకు నటుడు నాగార్జు ఎన్ కన్వెన్షన్ విషయంలో ఏం జరిగింది.? ఎందుకు ఆ విషయాన్ని దాచేశారు. ఆక్రమణలను ఎందుకు తొలగించలేదు. ఈ ఒక్క విషయం చాలు.. నేతల కక్కుర్తి ఏరకంగా ఉందో చెప్పడానికి.. కఠినంగా వ్యవహరించి ఉంటే పాలకుల పట్ల ప్రజల్లో నమ్మకం పెరిగేది. కిర్లోస్కర్ కమిటీ నివేదిక ప్రకారం 390 కి.మీ. నాలాలుంటే, మూసీకి దారితీసే 170 నాలాలపై నూరు శాతం అక్రమ నిర్మాణాలున్నాయని ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా చెప్పారు. వాటన్నింటినీ తొలగిస్తామన్న కేసీఆర్, ఇక ముందూ అక్రమ నిర్మాణాల్ని ఉపేక్షించేది లేదన్నారు. కానీ తొమ్మిదనరేళ్లలో అలాంటి పని చేయలేక పోయారు. అందుకే ఇప్పుడు కాంగ్రెస్ చేస్తానంటే విమర్శలకు దిగుతున్నారు. రాజధానిలో 165 చెరువులు అసలు కనిపించడమే లేదని రెవిన్యూ అధికారుల రికార్డులు చెబుతున్నాయి. అడ్డగోలుగా నిబంధనలు ఉల్లంఘించిన మహానగర పాలక సంస్థ అధికారులు బిల్డర్లతో లాలూచీపడి అక్రమ నిర్మాణాలకు కారణభూతులయ్యారు. అనుమతులు ఇచ్చిన అధికారుల్ని, సంపాదించిన బిల్డర్లను వదిలేసి, జీవితకాల కష్టార్జితాన్ని ధారపోసి ఇళ్లు కొనుక్కొన్న వారిని రోడ్డున పడేస్తున్నారు. ఇకపోతే మిషన్ కాకతీయ గురించి గొప్పలు చెప్పుకుంటున్న వారు నగరంలో,శివార్లలో కనీసం ఒక్క చెరువును అయినా ఎందుకు బాగు చేయలేదు. అక్రమ కట్టడాల తొలగింపులో పేదలు, మధ్యతరగతి ప్రజలకు ఉచితంగా రెండు పడక గదుల ఇళ్లను కట్టిస్తామన్న సర్కారు, ముందువారికి ఆవాసాలు చూపించాకే వాళ్లను ఖాళీ చేయించాలి. అసాధారణ వర్షాలు వచ్చినప్పుడు సమస్యలు చుట్టుముడుతున్నాయి. ఎక్కడైతే నాలాలను అక్రమంగా ఆక్రమంచు కున్నారో అక్కడే నీట మునుగుతున్నాయి.

హైదరాబాద్‌లో ఈ దుస్థితికి గత ప్రభు త్వాలే కారణం. దీనిని చక్కదిద్దేందుకు చిత్తశు ద్ధితో ముందుకు సాగాలి.

# 'అహింస స్వచ్ఛ భారత్' ధ్యేయంగా 'ఆరోగ్య భారత్' ను నిర్మించాలి

## అత్తాపూర్, రాజేంద్రనగర్ డివిజన్, హైదరాబాద్





రాజేంద్రనగర్ అక్టోబర్ 03 (ప్రజామంటలు):
మహాత్మా గాంధీ ప్రబోధించిన అహింసా' "స్వచ్ఛ భారత్" ధ్యేయంగా ఆరోగ్య భారత్ నిర్మాణానికి సమాజం సమాయత్తం కావాలని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా 'మాజీ డైక్టర్' రాధా మాధవ రావు అన్నారు. లక్ష్మి నగర్ పార్క్ ఎబిసి లాఫింగ్ క్లబ్' అత్తాపూర్ యోగా సెంటర్ ఆధ్వర్యంలో అహింస అంతర్జాతీయ దినోత్సవం గాంధి జయంతి, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు అత్తాపూర్ యోగా సెంటర్ గురువు బి. సుధాకర్ గౌడ్ ఆదేశాల మేరకు జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా మాజీ డైరెక్టర్ రాధ మాధవ రావు మాట్లాడుతూ.... బాపూజీ, లాల్ బహదూర్ శాస్త్రి ఆదర్శాలను నేరవే ర్చినపుడే అభివృద్ధి భారత్ సాకారమై ఆర్థిక స్వావలంబన స్వయం సమృద్ధి సాద్యమౌతుందని అన్నారు. ఆత్మీయ అతిథిగా హాజరైనా హైకోర్టు సీనియర్' అడ్వకేట్ గోటేటి 'లక్ష్మి నరసింహ' మాట్లాడుతూ అవినీతి రహిత సమాజ స్థాపన ప్రక్రియలో పౌరసమాజం భాగస్వామ్యం పొంది సామాన్యునికి సామాజిక న్యాయం ఆర్థిక న్యాయ కల్పనలో ప్రభుత్వం పౌర సమాజం సమిష్టిగా కృషి చేయాలన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఎబిసి లాఫింగ్ క్లబ్' అత్తాపూర్ యోగా సెంటర్ 'కో కన్వీనర్ 'ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు ఎస్. మహేందర్ మాట్లాడుతూ.... జాతిపిత బోధనలు నేడు సమాజంలో ఎదురౌతున్న సమాజిక 'ఆర్థిక' రాజకీయ సమస్యల పరిష్కారానికి మార్గమని అన్నారు. గత నాలుగు దశాబ్దాలుగా ఆర్థిక శాస్త్ర పరిజ్ఞానం పరివ్యాప్తియే లక్ష్యంగా 'ఆర్థిక వ్యవస్థ ఎదుర్కుంటున్న సమస్యలపై రచనలు చేస్తూ కవితల ద్వారా అవగాహన చైతన్యం కలిగిస్తున్న తెలంగాణ ఎకనామిక్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు' నేదునూరి కనకయ్య, శ్రీమతి' నేదునూరి 'సరిత కుమారిని శాలువాతో ఘనంగా సన్మానిస్తూ వారి సేవలను అభినందనీయమని రాధ మాధవ రావు, గోటేటి లక్ష్మి నరసింహ కొనియాడారు. సన్మానం పొందిన నేదునూరి కనకయ్య మాట్లాడుతూ.... తనకు జరిగిన సన్మానానికి కృతజ్ఞత తెలుపుతూ ఈ సన్మానం నాలో మరింత సామాజిక బాధ్యతను పెంచిందన్నారు. "ప్రతి వ్యక్తి నాకోసం కాదు మీకోసం" అనే సమాజ సేవా దృక్పథంతో జీవించాలని సమాజ సేవలో తరించాలని సీనియర్ యోగ సభ్యులు బ్రహ్మానందం నాయుడు అన్నారు. లక్ష్మీ నగర్ కాలనీ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షులు 'బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి' శ్రీపాద సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ బాపూజీ జీవన శైలిని ఆదర్శంగా తీసుకొని పేదరికం 'నిరుద్యోగం' ఆకలి రహిత భారత్ నిర్మాణానికి అంకితం కావాలని పిలుపునిచ్చారు. నారమ్ రాజేంద్రనగర్ టెక్నికల్ ఆఫీసర్ నడికుడి ప్రభాకర్ రావు మాట్లాడుతూ.... నేదునూరి కనకయ్య ఆర్థికవేత్తగా సాహితీ వేత్తగా సమాజ జాగృతికి చేస్తున్న సేవలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో 'ఎబిసి లాఫింగ్ క్లబ్' అత్తాపూర్ యోగా సెంటర్ సభ్యులు సిఎం. శ్రీకాంత్, పీ.ఎల్. శ్రీనివాస్, సోమేష్, సాయి, సీత, సుజాత, సరిత, విజయ తదితరులు పాల్గొన్నారు.




జనగామ జిల్లా వాసవి కాలనీ లో గురువారం జరిగిన బతుకమ్మ పండుగ వేడుకలలో పాల్గొన్న మహిళలు



జనగామ జిల్లా రఘునాథ్ పల్లి మండలం మేకలగట్టు గ్రామ రెవెన్యూ పరిధిలోని గిద్దె బండ తండాలో బుధవారం సాయంత్రం ఈదురు గాలులతో కురిసిన వర్షానికి గ్రామానికి చెందిన యువ రైతు సృజన్ రాయ్ చెందిన వరిపంట మొత్తం పనికిరాకుండా నేలవాలిపోయింది. దీంతో తనకు భారీ నష్టం వాటిల్లిందని ఆ రైతు వాపోతున్నాడు.



జగిత్యాల పట్టణంలోని జమ్మిగద్దె వద్ద దసరా నవరాత్రుల ఏర్పాట్లను పరిశీలించిన మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్. వీరి వెంట పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, కౌన్సిలర్లు పల్లెపు రేణుక మొగిలి, క్యాదాసు నవీన్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, స్థానికులు

## కేటీఆర్ పై కొండా సురేఖ చేసిన ఆరోపణలు వెంటనే ఉపసంహరించాలి

### మాజీ కార్పొరేషన్ చైర్మన్, దేవిప్రసాద్

హైదరాబాద్ అక్టోబర్ 03 (ప్రజామంటలు):
మహిళా సమాజానికి బేషరతుగా క్షమాపణలు చెప్పాలని, సినీ రంగం లో ఉన్న మహిళా నటుల పై కొండా సురేఖ చేసిన ఆరోపణల పై సినీరంగ పెద్దలు స్పందించాలని దేవిప్రసాద్, మాజీ కార్పొరేషన్ చైర్మన్ డిమాండ్ చేశారు. మూసీ, హైడ్రా వలన వచ్చిన ప్రజావ్యతిరేకతను ప్రజల దృష్టి మళ్లించడానికి చేస్తున్న హైడ్రామా ను ప్రజలు గమనిస్తున్నారు. సహజంగా రాజకీయాలకు దూరంగా ఉండే సినీ ప్రముఖుల పట్ల ఇలాంటి వ్యాఖ్యలపై కాంగ్రెస్ అధిష్టానం ముఖ్యంగా సోనియా స్పందించాలి. కొండ సురేఖను మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలి. కాంగ్రెస్ చేస్తున్న దురాఘాతాలపై ప్రజాస్వామిక ముసుగులో ఉన్న మేధావులు స్పందించాలి.






## డి.ఎం.డి. యూత్ క్లబ్ మిత్రుల ఔదార్యం

### నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం

కరీంనగర్/ధర్మపురి అక్టోబర్ 03 (ప్రజామంటలు):
గత నెల సెప్టెంబర్ 15న పొలాస స్టేజ్ వద్ద ఆక్సిడెంట్ అయిన ధర్మపురి పట్టణానికి చెందిన బాలుడు నారవేణి మల్లికార్జున్ చికిత్స కోసం కరీంనగర్ లోని ఒక ప్రవేట్ హాస్పిటల్ లో జాయిన్ కావడం జరిగింది. నిరుపేద కుటుంబం కావడంతో డి.ఎం.డి. యూత్ క్లబ్ మిత్రులు నగదు 36,000 రూపాయలు ఆర్థిక సహాయం యూత్ సభ్యులు లక్ష్మణ్, గుడ్ల రవి చేతుల మీదుగా కరీంనగర్ హాస్పిటల్ లో వారి కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగింది. గతంలో కూడా చాలా సేవాకార్యక్రమాలు చేసిన ఈ యూత్ సభ్యులను పలువురు అభినందించారు.



## జగిత్యాలలో అంగరంగ వైభవంగా 'నవదుర్గా' అమ్మవారి శోభా యాత్ర

### మంగళ హారతులతో స్వాగతం పలికిన మహిళలు - ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణలు,నృత్య ప్రదర్శనలు






జగిత్యాల అక్టోబర్ 03 (ప్రజామంటలు):
దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలో అంగరంగ వైభవంగా జిల్లా కేంద్రంలోని టాకా సంధి నుండి డప్పుచప్పులు, చిన్నారుల వేషధారణలతో అమ్మవారి శోభాయాత్ర ప్రారంభమై స్థానిక తహసీల్ చౌరస్తా నుండి, రాం బజార్, కొత్త బస్టాండ్, మీదుగా గోవిందు పల్లి నవదుర్గా పీఠ క్షేత్రం వరకు శోభాయాత్ర నిర్వహించారు. చిన్నారులతో వివిధ వేషధారణ, మహిళలు మంగళహారతులతో, విద్యార్థులు కోలాటాలు ఆడుతూ నృత్యాలు సందడి చేశారు. బతుకమ్మ పాటలతో చిన్నారులు, మహిళలు పెద్ద సంఖ్యలో భక్తిశ్రద్ధలతో భవాని దీక్షపరుల మధ్యన అంగరంగ వైభవంగా శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం దేవాలయంలో నవరాత్రోత్సవాలను వేద బ్రాహ్మణుల మంత్రోత్సరణల మధ్య కలశ స్థాపన ప్రత్యేక పూజ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో నవ దుర్గా సేవా సమితి సభ్యులు, అర్చకులు, భక్తులు, నిర్వాహకులు పాల్గొన్నారు.



## వచ్చావా అమ్మ.. దుర్గమ్మ తల్లీ..

- చిరు అందెల చప్పుడు...
- పాదాల పారాణి...
- కాలి మెట్టెల వెన్నెల ధార తెలుపు...
- కనకపు మెరుపు అంచుగల ఎర్రటి చీర...
- నడుముకు నాజుకైన వడ్డాణం...
- నాలుగు అభయ హస్తాలు...
- చేతుల్లో ఆయుధాలు...
- భుజాల మణికాంతులు...
- సున్నిత కంఠ సౌందర్య సౌష్టవం...
- పెదవులు మృదువు దరహాసాలు...
- ముక్కుపై మెరుపుతీగలా మెరిసే ముక్కెర...
- కరుణా కటాక్షం కళ్ళ చూపులు...
- నుదిటిన బ్రహ్మాండ సృష్టి సూచిన బొట్టు...
- చెవులకు వేలాడే సృష్టిలీలా లోలాకులు...
- ఆకర్షణీయమైన నల్లని కురులు...
- నిలువెత్తు రూపం నుంచి వస్తున్న సువాసనలు...

ఆశ్చర్య ఆనందాలతో చూస్తూ నిలబడిన నేను...
- ఎదవుల్లోంచి నవ్వుతో ఏరా ఎట్టున్నావనే మధుర పలుకులు
అది విని నా ముఖంపై వచ్చిన నవ్వు...
వచ్చావా అమ్మ.. రా...
నా మనసు సింహాసనంపై కూర్చో అమ్మ.
నీ దర్శన ఆనందంతో మౌనం తప్ప
మాటలు రాని స్థితిలో ఉన్నాను.
నా కళ్ళ ఆనంద తడితో పాదాలు కడుగుతాను
అనుగ్రహించు అమ్మ...

( సేకరణ : అంకం భూమయ్య,
ప్రజామంటలు రిపోర్టర్, గొల్లపల్లి )








జగిత్యాల పట్టణంలోని మార్కండేయ దేవాలయంలో ఏర్పాటు చేసిన గాయత్రి దుర్గ మాత శోభాయాత్రలో దుర్గా మాత వేషధారణలో పాల్గొన్న శాతవాహన యు.పి.ఎస్. స్కూల్ చిన్నారి అల్లాడి ప్రద్య. 'సెంటర్ ఆఫ్ ద ఎట్రాక్షన్' గా నిలిచి ప్రజలతో మన్నలను అందుకొన్న చిన్నారి ప్రద్య.

# ఉపాధ్యాయ ఎంపిక కోసం అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన ప్రక్రియ పక్కాగా జరగాలి

**అభ్యర్థులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో పరిశీలన కేంద్రానికి రావాలి**

**ధ్రువీకరణ పత్రాల పరిశీలన కార్యక్రమం వేగవంతంగా జరగాలి**

**జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా**



జనగామ అక్టోబర్ 03 (ప్రజామంటలు): డి.ఎస్సి 2024లో అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన ప్రక్రియ పక్కాగా వేగవంతం గా చేపట్టాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ తెలిపారు. డి.ఎస్సి. 2024 లో అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన కార్యక్రమం స్థానిక జిల్లా కేంద్రంలోని ప్రిస్టన్ హై స్కూల్లో జరుగుతుండగా గురువారం కలెక్టర్ స్వయంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... ఉపాధ్యాయ నియామక ప్రక్రియ కి సంబందించి అర్హత సాధించిన అభ్యర్థుల ధృవీకరణ పత్రాల పరిశీలన పక్కాగా చపట్టాలన్నారు. క్వాలిఫై అయిన అభ్యర్థులతో కలెక్టర్ మాట్లాడారు. కౌంటర్లను పరిశీలిస్తూ తగు సూచనలు ఇచ్చారు. ధ్రువీకరణ పత్రాల పరిశీలన కొరకు చేపట్టిన ఏర్పాట్లను కలెక్టర్ జిల్లా విద్యాశాఖ అధికారి ని అడిగి తెలుసుకున్నారు. ఎస్.ఏ. (స్కూల్ అసిస్టెంట్లు) లకు రెండు కౌంటర్లు, ఎస్.జి.టి. టసెకండరీ గ్రేడ్ టీచర్లుఊ లకు ఒకటి, తెలుగు, హిందీ పండిట్ లకు ఒకటి, మరొకటి పి.ఈ.టి.లకు కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు డీఈఓ వివరించారు. కాగా ఈరోజు మొత్తం 514 మంది అభ్యర్థులకు గాను 422 మంది అభ్యర్థుల ధ్రువ పత్రాల పరిశీలన పూర్తయ్యిందని మిగతా వారు రేపు హాజరు కావచ్చని డీఈఓ తెలిపారు. కలెక్టర్ వెంట ఉమ్మడి వరంగల్, హన్మకొండ, జనగామ జిల్లాల పరిశీలకులు విజయ లక్ష్మి, జిల్లా విద్యాశాఖ అధికారి రాము, విద్యా శాఖ అధికారులు శ్రీధర్, రామరాజు పాల్గొన్నారు.



# రాపల్లి కోటలో పోలీసుల కార్డెన్ సెర్చ్

మహాదేవపూర్ అక్టోబర్ 03 (ప్రజామంటలు): మహాదేవపూర్ మండలం రాపల్లికోట గ్రామంలో గురువారం ఉదయం ఎస్సై కే పవన్ కుమార్ కాళేశ్వరం ఎస్ఐ చక్రపాణి ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు ఇందులో భాగంగా రాపల్లికోట గ్రామంలో ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీలు చేసి సరియైన ధృవ పత్రాలు లేని వాహనాలను నెంబరు ప్లేట్లు లేని వాహనాలను సీజ్ చేశారు. అనంతరం గ్రామంలోని ప్రధాని కూడలి వద్ద గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి ఎస్సై కే.పవన్ కుమార్ , మాట్లాడుతూ...నిషేధిత పదార్థాలైనా గుడుంబా గంజాయి ఎవరు అమ్మోద్దని, అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని లేకుంటే చట్టపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు. ఎవరైనా అనుమానాస్పదమైన వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం తెలియజేయాలని కోరారు. యువత బాగా చదువుకొని ఉన్నత స్థానంలో స్థిరపడాలని అన్నారు గ్రామంలో ఎటువంటి సమస్యలు ఉన్న పోలీసులకు తెలపాలని సూచించారు, సిసి కెమెరాలు ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో మహాదేవపూర్ కానిస్టేబుల్ కిషన్, తిరుపతి, అనంత్, చంద్రమోహన్, హెూంగార్డ్ మట్టి బాబు, భూపాలపల్లి జిల్లా స్పెషల్ పార్టీ పోలీసులు తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీసులు పాల్గొన్నారు.

# సర్వే సరిగ్గా చేయాలి, అన్ని వివరాలు నమోదు కావాలి

**పైలట్ ప్రాజెక్ట్ లో భాగంగా జిల్లాలో ఎంపిక చేసిన కుటుంబాలలో జరుగుతున్న సర్వే**

**సర్వే తీరును పరిశీలించిన కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా**



జనగామ అక్టోబర్ 03 (ప్రజామంటలు): అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలను అందించే విధంగా ప్రభుత్వం జారీ చేయనున్న ఫ్యామిలీ డిజిటల్ కార్డు కోసం జరుగుతున్న సర్వే పూర్తి స్థాయిలో పక్కాగా జరగాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. పైలట్ ప్రాజెక్టులో భాగంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఎంపిక చేసిన కుటుంబాలలో ఈరోజు నుండి 7 వ తేదీ వరకు జరిగే డిజిటల్ కార్డు జారీ ప్రక్రియ కి సంబందించిన సర్వే ను గురువారం జనగాం మున్సిపాలిటీ పరిధిలో ని 24 వ వార్డులో అలాగే స్టేషన్ ఘనపూర్ మండలం కి సంబందించి కన్నాయిపల్లి లో కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సర్వే చేస్తున్న అధికారులతో మాట్లాడుతూ... కుటుంబంలో ఉన్న వ్యక్తుల పేరు, జెండర్, పుట్టిన తేదీ, వయసు, కుటుంబ పెద్దతో ఉన్న సంబంధం, ఆధార్ నంబర్, అడ్రస్ తదితర వివరాలన్నీ పక్కాగా ఏ ఒక్కటి మిస్ కాకుండా నమోదు చేయాలన్నారు. ప్రతిరోజు కనీసం 50 కుటుంబాలలో సర్వే అయ్యేలా చూడాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకి నిర్ణీత గడువు లోగా సర్వే పూర్తి కావాలన్నారు. అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు )పింకేష్ కుమార్ జనగాం మండలం లోని పెద్దతండా (వై) లో జరుగుతున్న సర్వే ని అలాగే పాలకుర్తి మండలం రాఘవాపురం లో సర్వే తీరును అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్ పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే చేస్తున్న బృందాల వారికి తగు సూచనలను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, సంబంధిత తహసీల్దార్ లు తదితరులు పాల్గొన్నారు.

# న్యూ క్రియేషన్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ



జనగామ అక్టోబర్ 03 (ప్రజామంటలు): జనగామ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ మీట్‌లో న్యూ క్రియేషన్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి అనేక పతకాలు సాధించారు. చదువులను ఆస్వాదించడమే కాకుండా క్రీడలలో కూడ ప్రతిభను చాటారు. 14 ఏళ్లలోపు బాలురు - ఆదిత్య 60 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ రెండింటిలోనూ 3వ స్థానం ఓం మణి శరణ్ షాట్‌పుట్‌లో 1వ స్థానం. 14 ఏళ్లలోపు బాలికలు-భాను చందన షాట్‌పుట్ లో 2వ స్థానం లాంగ్ జంప్ 3వ స్థానం. వినుత్నా 60 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ రెండింటిలోనూ 2వ స్థానం.16 ఏళ్లలోపు బాలురు శుశాంత్ రెడ్డి షాట్‌పుట్‌లో ప్రథమ స్థానం, జావెలిన్ త్రోలో ద్వితీయ స్థానం. 16 ఏళ్లలోపు బాలికలు యుక్తికా షాట్‌పుట్, జావెలిన్ రెండింటిలో 1వ స్థానం, 60ఎం రన్‌లో 3వ స్థానం మనోగ్న షాట్‌పుట్, జావెలిన్ రెండింటిలోనూ 2వ స్థానం 18 ఏళ్ల లోపు బాలురు, ప్రఖ్యాత్ రెడ్డి షాట్‌పుట్, డిస్కస్, జావెలిన్ లలో 3వ స్థానం. ఈ విజయాలు న్యూ క్రియేషన్ స్కూల్‌లో మేము పెంపొందించే సమగ్ర అభివృద్ధిని ప్రతిబింబిస్తాయని, అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చిన విజేతలందరిని, స్పోర్ట్స్ డిపార్ట్మెంట్ ని అభినందిస్తూ, భవిష్యత్తులో ఈ విజయాలను కొనసాగించాలని న్యూ క్రియేషన్ యాజమాన్యం కోరింది.

# పసుపు బోర్డు ఏర్పాటు ప్రక్రియను వెంటనే ప్రారంభించాలి

**కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి విజ్ఞప్తి**



హైదరాబాద్ అక్టోబర్ 03 (ప్రజామంటలు): కేంద్ర ప్రభుత్వం శాసనసభ ఎన్నికలకు ముందు ప్రకటించిన జాతీయ పసుపు బోర్డును వెంటనే తెలంగాణ రాష్ట్రంలో ప్రారంభించాలని తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి ఒక ప్రకటనలో కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గత ఏడాది సెప్టెంబర్ లో తెలంగాణ రాష్ట్ర పర్యటనలో భాగంగా నిజామాబాద్ జిల్లాలో జరిగిన బహిరంగ సభలో ప్రధాని నరేంద్ర మోడీ పసుపు బోర్డును ఏర్పాటు చేస్తామని ప్రకటించారనీ, ఆ తర్వాత కేంద్ర మంత్రిమండలి దీనిపై నిర్ణయం తీసుకొని 2023 అక్టోబర్ 4వ తేదీన కేంద్ర ప్రభుత్వం గెజిట్ జారీ చేసినప్పటికీ పసుపు బోర్డును ఎక్కడ ఏర్పాటు చేస్తారనేది స్పష్టత ఇవ్వలేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పసుపు బోర్డును తెలంగాణ రాష్ట్రంలోని నిజామాబాద్ లో ఏర్పాటు చేసేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ నిర్ణయించినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి పసుపు బోర్డును తెలంగాణ రాష్ట్రంలోని నిజామాబాద్ జిల్లాలో ఏర్పాటు చేసేందుకు వీలుగా తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. పసుపు బోర్డు ఏర్పాటు కోసం తెలంగాణ రాష్ట్ర రైతులు దీర్ఘకాలికంగా ఎదురుచూస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లనే రాష్ట్రంలో పసుపు పంట సాగుపై తీవ్ర ప్రభావం పడుతోందనీ, తెలంగాణలో పసుపు బోర్డు ఏర్పాటు కోసం చాలా సంవత్సరాల తరబడి రైతులు, రైతు సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళన, నిరసన కార్యక్రమాలను పెద్ద ఎత్తున కొనసాగిస్తున్నారని తెలిపారు. గత పార్లమెంటు ఎన్నికల్లో పసుపు రైతులు పెద్ద ఎత్తున నిజామాబాద్ ఎంపీ స్థానానికి నామినేషన్లను వేసి తమ నిరసనను తెలియజేశారనీ, ఆ తర్వాత రైతుల ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారనీ తెలిపారు. పసుపు బోర్డు ఏర్పాటు కాకపోవడం వల్ల పసుపు పంట సాగు విస్తీర్ణం క్రమేపీ తగ్గుతోందనీ, పసుపు ధరల స్థిరీకరణకు, సాగు విస్తీర్ణం పెంచడానికి, అనుబంధ విలువ ఆధారిత ఉత్పత్తులను తయారుచేసి ఎగుమతి అవకాశాలను పెంచడానికి జాతీయ పసుపు బోర్డు ఏర్పాటు ఆవశ్యకత ఎంతైనా ఉన్నందున తక్షణమే తెలంగాణ రాష్ట్రంలోని నిజామాబాద్ జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి ప్రధాని నరేంద్ర మోడీకి విజ్ఞప్తి చేశారు.

# ఐద్వా జనగామ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి




జనగామ అక్టోబర్ 3 (ప్రజామంటలు): జనగామ ఐద్వా జిల్లా మహాసభలు జనగామ పట్టణంలో విజయ ఫంక్షన్ హాల్ లో ఈనెల 7 సోమవారం జరుగుతాయని,వీటిని జయప్రదం చేయాలని నాయకులు కోరారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జనగామ పట్టణంలోని ఐద్వ కార్యాలయంలో మహిళా సంఘం జనగామ పట్టణ అధ్యక్షులు బండా రమాదేవి అధ్యక్షతన జిల్లా కమిటీ అధ్యక్ష కార్యదర్శులు ఈఅహల్య ఎండి షబానా పాల్గొని మాట్లాడారు. ఈ మహాసభకు అఖిలభారత ప్రజాతంత్రం మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ జ్యోతి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆశాలత హాజరవుతున్నరని అన్నారు. ఈ మహాసభలలో గత మహాసభ నుండి ఈ మహాసభ వరకు మూడు సంవత్సరాల కాలంలో అయిద్వా చేసిన పోరాట కార్యక్రమాలు చర్చించుకుని భవిష్యత్ కర్తవ్యాల్ని రూపొందించుకొని ఉద్యమ కార్యాచరణ రూపొందించుకొని మహిళా ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తామన్నారు. జనగామ పట్టణ అన్ని రంగాల ప్రజలు ఈ మహాసభలను విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు పందిళ్ళ కళ్యాణి, మోకు భవాని కొండ వరలక్ష్మి చింతల శ్రీలత దేవమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యకారులు లక్షాధికారులు కావాలి

**ఫిషరీస్ ఫెడరేషన్ మాజీ చైర్మన్ పిట్టల రవీందర్ ఆకాంక్ష**



సిరిసిల్ల అక్టోబర్ 03 (ప్రజామంటలు): తెలంగాణ రాష్ట్రంలో మత్స్య రంగం మీద ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులందరూ లక్షాధికారులుగా ఎదగాలని తెలంగాణ ఫిషరీస్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు పిట్టల రవీందర్ ఆకాంక్షించారు. తంగళ్ళపల్లి మండల కేంద్రంలో "ప్రకృతి పర్యావరణ సంస్థ" ఆధ్వర్యంలో నిర్వహించిన మత్స్య సహకార సంఘాల అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సమావేశానికి జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షులు చొప్పరి రామచందర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పిట్టల రవీందర్ మాట్లాడుతూ.... కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్యరంగం అభివృద్ధి కోసం మరియు మత్స్యకారుల సంక్షేమం కోసం అమలు తెలుపుతున్న పథకాలను సద్వినియోగపరచుకొని మత్స్యకారులందరూ హార్థికంగా ఎదగాలని ఆయన సూచించారు. కేంద్ర ప్రభుత్వం 20 వేల కోట్ల రూపాయల భారీ నిధులతో దేశవ్యాప్తంగా అమలు జరుపుతున్న "ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం" లో భాగంగా ప్రాథమిక మత్స్య సహకార సంఘాలను మరింత బలోపేతం చేయడం కోసం మరియు ఆ సంఘాలలో సభ్యులుగా కొనసాగుతున్న మత్స్యకారులను ఆర్థికంగా అభివృద్ధి పరిచేందుకు అనేక పథకాలను అమలు జరుపుతున్నదని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. "ప్రకృతి పర్యావరణ సంస్థ" లాంటి స్వచ్ఛంద సంఘాలు మత్స్యకారులను లక్షాధికారులను చేసే దిశలో కొనసాగిస్తున్న కృషి ప్రశంసనీయమైనదని ఆయన అన్నారు. తెలంగాణలోని మత్స్యకారులు చేపల పెంపకం విషయంలోనూ, పంపిణీ విషయంలోనూ సాంప్రదాయ పద్ధతులకు బదులుగా ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకి వస్తున్న ఆధునిక విధానాలను అలవరచుకోవాలని, ముఖ్యంగా విలువల జోడింపు (వ్యాల్యూ ఆడిషన్), చేపల శుద్ధి (ఫిష్ ప్రాసెసింగ్), మార్కెటింగ్ చేపల మరియు రొయ్యలకు సంబంధించిన పచ్చళ్ల తయారీలో అవసరమైన శిక్షణను ఇప్పించేందుకు "ప్రకృతి పర్యావరణ సంస్థ" లాంటి స్వచ్ఛంద సంఘాలు ఎంతో కృషి చేస్తున్నాయని ఆయన కొనియాడారు. తెలంగాణలో ఉత్పత్తి చేసే చేపలకు ఇతర రాష్ట్రాలతో సహా విదేశాలలోనూ మంచి గిరాకీ ఉన్నదని, ఈ అవకాశాలను గ్రామీణ స్థాయి సహకార సంఘాలు కూడా వినియోగించుకున్నప్పుడే మత్స్యకారులు లక్షాధికారులుగా ఎదగలుగుతారని పిట్టల రవీందర్ ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో సాంప్రదాయ నీటి వనరులతో పాటు మిడ్ మానేర్, అప్పర్ మానేరు, అనంతసాగర్ లాంటి అనేక నీటిపారుదల ప్రాజెక్టులు అందుబాటులో ఉన్నాయని, వీటిని సద్వినియోగ పరుచుకొని మత్స్యకారులు ఆర్థికంగా మెరుగుపడేందుకు అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలని పిట్టల రవీందర్ సూచించారు. ఈ సందర్భంగా ప్రకృతి పర్యావరణ సంస్థ అధ్యక్షులు పి. మాధవరావు మాట్లాడుతూ.... ప్రపంచవ్యాప్తంగా మత్స్య రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా సాంప్రదాయ మత్స్యకారులు కూడా మార్పు చెందాలని తగనుగుణంగా తమ ఆర్థిక కార్యకలాపాలను విస్తరించుకోవాలని సూచించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా మత్స్యశాఖ అధికారి వరదారెడ్డి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు జరుపుతున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకునేందుకు గ్రామస్థాయి మత్స్య సహకార సంఘాలు ముందుకు రావాలని, సహకార సంఘాల సభ్యులను చైతన్యవంతం చేయడంలో ఆయా సంఘాల బాధ్యులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షులు చొప్పరి రామచంద్ర మాట్లాడుతూ గతంలో కేవలం 92 మత్స్య సహకార సంఘాలు మాత్రమే ఉండేవని, గడిచిన రెండు సంవత్సరాల కాలంలో ఈ సంఖ్యను 150కి పెంచుకోగలిగినట్లు వివరించారు. కాగా రాజన్న సిరిసిల్ల జిల్లా నలుమూలల నుండి వచ్చిన మత్స్య సహకార సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, జిల్లా మత్స్య సహకార సంఘం వైస్ చైర్మన్ శేఖర్, డైరెక్టర్ పరుశరాములు తదితరులు కూడా పాల్గొన్నారు.

# ధర్మపురిలో వైభవంగా శరన్నవరాత్రులు ప్రారంభం

(రామకిష్టయ్య సంగన భట్ల)

**ధర్మపురి అక్టోబర్ 03 (ప్రజామంటలు):** దక్షిణ కాశిగా హరిహర క్షేత్రంగా, దివ్యనారసింహ క్షేత్రంగా, దక్షిణాభిముఖియై ప్రవహిస్తున్న పవిత్ర గోదావరీ తీరాన వెలసి భక్తి ముక్తి ప్రదాయినిగా, వరదాయినిగా పౌరాణిక, చారిత్రిక, ఐతిహాసిక ప్రాధాన్యతను సంతరించుకున్న వైవిధ్య భరిత పలు దేవాలయాల సముదాయంతో విరాజిలు తున్న పుణ్యతీర్థమైన ధర్మపురి క్షేత్రంలో గురు వారం శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవోపేతంగా ప్రారంభ మైనాయి. ధార్మిక క్షేత్రంలో సకల దేవాలయాలలో నవరాత్రి ఉత్సవాల ప్రారంభ సందర్భంగా ఆలయాలలో సంప్రోక్షణలు గావించి, దేవస్థాన అర్చకులు ప్రత్యేక పూజాదికాలు నిర్వహించగా, గోదావరి నదిలో మంగళ స్నానాలు ఆచరించిన భక్తజనం స్థానిక దైవాలను దర్శించు కున్నారు. దేవస్థానంలోని ప్రధానాలయాలైన శ్రీ యోగానంద, ఉగ్ర లక్ష్మీ సమేత నారసింహ, శ్రీ వేంకటేశ్వర, శ్రీరామలింగేశ్వర ఆలయాలలో ఉదయం కలశ స్థాపన, మహా సంకల్పం, పృథ్వీ, గణపతి పూజ, గౌరీ పూజ, స్వస్తి పుణ్యాహ వాచనం, రుత్విగ్వరణం, అఖండ దీపస్థాపన నవగ్రహ, వాస్తు, క్షేత్రపాలక, యోగినీ, అంకురారోపణ, మాతృకా, నవగ్రహ పూజలు సర్వతోభద్ర మండల స్థాపనం, దేవీ కలశ స్థాపనం, సప్తశతి పారాయణం, స్థాపిత దేవతా పూజలు, లలితా సహస్ర నామావళి స్తోత్రాలతో చతుష్షష్టి ప్రత్యేక పూజలు, శ్రీచక్రమునకు కుంకుమార్చన, హారతి, మంత్ర పుష్పం, నీరాజనం, తీర్థ ప్రసాద వితరణాది సాంప్రదాయ పూజలను నిర్వహించారు. కన్యకా, సువాసిని పూజలు జరిపారు. అమ్మ వారు "శైలపుత్ర ఎరుపు రంగు చీరలో మలెపూలు, బిల్వపత్రి దండలు ధరించి భక్తులకు దర్శనం ఇచ్చింది. దేవస్థానం ఏసీ ఈఓ శ్రీనివాస్, సూపరింటెండెంట్ కిరణ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ పర్యవేక్షణలో, వేదపారాయణ దారులు బొజ్జ రమేష్ శర్మ, సిహెచ్. ముత్యాల శర్మ, భరత్ శర్మ, పాలెపు ప్రవీణ్ శర్మ, ఉప ప్రధాన అర్చకులు నేరేళ్ళ శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసా చార్యులు, అర్చకులు ద్యావళ్ళ విశ్వనాథ శర్మ, బొజ్జ సంతోష్ కుమార్, బొజ్జ రాజగోపాల్ శర్మ, ఋత్వికులు నంబి అరుణ్ కుమార్, పాలెపు సందీప్ శర్మ, ద్యావళ్ళ సాయి శర్మ అర్చకులు కార్యక్రమాలను జరిపించారు. సిబ్బంది సహకరించారు. భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం దేవీ పూజ, సుహాసిని కన్యకా పూజ, హారతులు, మంత్రపుష్ప, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీనర్మదేశ్వర మందిరంలో, మేళ తాళాలతో, మంగళవాద్యాలతో, వేద మంత్రోచ్చాటనలతో పురవీధుల గుండా ఊరేగింపు జరిపిన అనంతరం దుర్గా మాత విగ్రహ ప్రతిష్టా కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. డీటీడీ కణ్యాణ మంటపంలో నవదుర్గ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో దుర్గామాతకు ప్రాంభ దిన పూజలు నిర్వహించారు. సాయంత్రము 6.00 గం.లకు శ్రీ యోగ, ఉగ్ర నృసింహస్వామి వార్ల ఊరేగింపు అశ్వవాహనంపై గ్రామములోని పురవీధులలో తిరిగి దేవాలయమనకు విచ్చేశాయి.







## కొలిచిన వారికి కొంగు బంగారం

### కోరుట్ల త్రిశక్తి మాత ఆలయంలో దుర్గామాత దీక్షలు

**కోరుట్ల అక్టోబర్ 03 (ప్రజామంటలు):** కొలిచిన వారికి కొంగు బంగారంగా గణేష్ నవదుర్గమండలి ఆధ్వర్యంలో త్రిశక్తి మాత ఆలయంలో నవరాత్రోత్సవాలకోసం ఆలయ అర్చకులు పాలేపు శివ కుమార్ నిర్వహణలో 250 పైనే దుర్గామాత దీక్షలు చేపట్టారు. పిల్లలనుండి, వృద్దుల వరకు నియమ నిష్టలతో తొమ్మిది రోజులపాటు దీక్షలో ఉంటారు. కోరుట్ల పట్టణంలో గణేష్ నవదుర్గమండలి ఆధ్వర్యంలో త్రిశక్తి మాత ఆలయం ఎంతో ప్రాశస్త్యం కలిగిన ఆలయంగా చెప్పుకుంటారు. సుమారు 47 సంవత్సరాలుగా ఇక్కడ ప్రతి సంవత్సరం పెద్ద ఎత్తున దీక్షలు తీసుకుంటారు. ఇక్కడి అమ్మవారినిదర్శించుకునేందుకు నిజామాబాదు, వరంగల్, ఆదిలాబాదు, కరీంనగర్ తోపాటు వివిధ ప్రాంతాలనుండి భక్తులు వస్తుంటారు. దుర్గామాత నవరాత్రుల ఉత్సవాలు ఈ ఆలయంలో అత్యంత వైభవంగా నిర్వహిస్తారు, పెద్ద ఎత్తున దుర్గామాత దీక్షలు తీసుకోవడం ఇక్కడి విశిష్టత, గురువారం ఆలయంలో పెద్ద ఎత్తున సుమారు 250 పైన దుర్గామాత దీక్షలు తీసుకున్నారు. తొమ్మిది రోజులపాటు నియమ నిష్ఠలతో అమ్మవారిని కొలిచి, అనంతరం దీక్ష విరమింప చేస్తారు, గణేష్ నవదుర్గ మండలి ఆధ్వర్యంలో త్రిశక్తి మాతా దేవాలయంలో ఇక్కడ నిత్యం పూజలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో గణేష్ నవదుర్గ మండలి అధ్యక్షులు కటుకం గణేష్, ప్రధాన కార్యదర్శి గజ్జల శంకర్, కోశాధికారి ఆడువాల ప్రభాకర్, 11వ వార్డు కౌన్సిలర్ దాసరి సునిత, గంగుల రాంగోపాల్, ముక్కెర చంద్రశేఖర్, సభ్యులు కస్తూరి రాజేశ్వర్, కటుకం గంగారాం, సంకు అశోక్, గాజుల రమేష్, వెంకటేశం, కస్తూరి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## కళ్యాణ లక్ష్మి, సీఎంఆర్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి

**జగిత్యాల అక్టోబర్ 03 (ప్రజామంటలు):** జగిత్యాల పట్టణ పొన్నాల గార్డెన్స్ లో జగిత్యాల పట్టణ మరియు అర్బన్, రూరల్ మండలాలకు చెందిన 149 మంది ఆడబిడ్డలకు మంజూరైన ఒక కోటి 49 లక్షల 17 వేల రూపాయల కళ్యాణ లక్ష్మి చెక్కులను, 97 మంది లబ్ధిదారులకు మంజూరైన 30 లక్షల రూపాయల విలువగల సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, పాక్స్ చైర్మన్ మహిపాల్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, తహసిల్దార్ లు రామ్మోహన్, శ్రీనివాస్, కౌన్సిలర్ లు, కో ఆప్షన్ సభ్యులు,మాజీ సర్పంచ్ లు, ఎంపీటీసీ లు,ప్రజా ప్రతినిదులు, రెవెన్యూ సిబ్బంది అధికారులు తదితరులు.

## నోబెల్ శాంతి సమ్మిట్ లో సామల వేణు

### మెక్సికోల జరిగిన నోబెల్ పీస్ సమ్మిట్ - ఇండియా నుంచి మొదటిసారిగా ఓ మెజిషియన్‌కు ఆహ్వానం

**సికింద్రాబాద్ అక్టోబర్ 03 (ప్రజామంటలు):** గిన్నిస్ వరల్డ్ రికార్డ్ మెజిషియన్ హైదరాబాద్ కు చెందిన సామల వేణు మెక్సికో లో జరిగిన నోబెల్ శాంతి బహుమతి గ్రహీతల సమ్మిట్ లో పాల్గొన్నారు. ఇండియా నుంచి మొదటిసారిగా నోబెల్? శాంతి సమ్మిట్ లో పాల్గొన్న ఫస్ట్ మెజిషియన్ గా సామల వేణు రికార్డు నెలకొల్పారు. మెక్సికో లో మూడు రోజుల పాటు జరిగిన 19వ నోబెల్ శాంతి అవార్డు గ్రహీతల సమ్మిట్ లో సామల వేణు ప్రదర్శన ఇచ్చి, అందరి మన్ననలు పొందారు. తన 42 ఏండ్ల ఇంద్రజాల ప్రస్థానంలో మెక్సికోలో జరిగిన ప్రపంచ నలుమూలాల నుంచి వచ్చిన నోబెల్ శాంతి బహుమతి గ్రహీతల మధ్య ప్రదర్శన ఇవ్వడం గొప్ప అనుభూతిని ఇచ్చిందని సామల వేణు పేర్కొన్నారు.





**ఏడు వేల ప్రదర్శనలతో గిన్నిస్ రికార్డు:**
సామల వేణు ఇంతవరకు ఏడు వేల ప్రదర్శనలను 30 కి పైగా ప్రపంచ దేశాల్లో ఇచ్చి, గిన్నిస్ వరల్డ్ రికార్డు లోకి ఎక్కారు. రెండు సందర్భాల్లో అమెరికా కు చెందిన ఇంటర్నేషనల్ సోసైటీ ఆఫ్ మెజిషియన్స్ నుంచి మెర్లిన్ అవార్డులను గెలుపొందారు. 2008లో సామల వేణు హైదరాబాద్ లో ఓ మెజిషియన్ అకాడమీ నెలకొల్పి, కొత్త తరం మెజిషియన్లకు బాసటగా నిలిచి, వారి సంక్షేమం కోసం కృషి చేస్తున్నారు. కొత్తతరం ఔత్సాహికులకు ఇంద్రజాలంలో శిక్షణ ఇస్తూ, మెలుకవలలను నేర్పుతున్నారు. వేణు తీసుకొన్న చొరవ, కృషితో స్పందించిన అధికారులు పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్శిటీలో మొదటిసారిగా మ్యాజిక్ లో డిప్లొమా కోర్సును ప్రారంభించారు. ఈ నేపద్యంలో మెజిషియన్స్ అకాడమీ సెక్రటరీ జి.పూర్ణచందర్ మాట్లాడుతూ...సామల వేణు ప్రపంచ స్థాయి సమ్మిట్ లో విజయవంతంగా ప్రదర్శన ఇవ్వడం ఇండియన్ మ్యాజిక్ రంగంలో ఓ మైలురాయిగా నిలిచిపోతుందన్నారు.

## ముల్కనూర్ మహిళా డెయిరీ సభ్యులకు రూ. 11 కోట్ల బోనస్ పంపిణీ

**భీమదేవరపల్లి అక్టోబర్ 03 (ప్రజామంటలు):** ముల్కనూరు మహిళా సహకార డెయిరీ సభ్యులకు రూ. 11 కోట్ల 57 లక్షలు బోనస్ పంపిణీ చేసినట్లు అధ్యక్షురాలు బుర్ర ధనశ్రీ వెల్లడించారు. గురువారం మహిళా డెయిరీ ప్రధాన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ముల్కనూరు పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల్లో పాలు పోస్తున్న సభ్యులకు వారి అకౌంట్ లలో బోనస్ జమ చేసినట్లు పేర్కొన్నారు. దీని వల్ల 203 గ్రామాల్లో 17,612 మంది సభ్యులకు లబ్ధి చేకూరుతుందని వెల్లడించారు. ఆమెతో పాటు డెయిరీ జీఎం మారుపాటి భాస్కర్ రెడ్డి ఉన్నారు.





## ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ను కలిసిన జగిత్యాల జిల్లా బాయిల్డ్ రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

**జగిత్యాల అక్టోబర్ 03 (ప్రజామంటలు):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న వడ్ల కు 500 బోనస్ మరియు ప్రజలకు సన్న బియ్యం పంపిణీ అభినందనీయం అన్నారు. 2024 25 ఖరీఫ్ సీజన్లో సీఎంఆర్ ధాన్యం సేకరణ విషయం లో మరియు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు సన్న బియ్యం పంపిణీ విషయం లో రైస్ మిల్లర్ల కి ఎదురయ్యే సమస్యలు వాటి త్వరిత గతిన పరిష్కారం గురించి ఎమ్మెల్యే కి వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్, ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్ళి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నవీన్ రావు, చెన్న కేశవ్, శ్రీనివాస్ రావు, మధు, సుధాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## హుషారుగా చిన్నారుల బతుకమ్మ సంబరాలు



**సికింద్రాబాద్ అక్టోబర్? 03 (ప్రజామంటలు):** బన్సీలాల్ పేట డివిజన్ బోలక్ పూర్ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ లో చిన్నారులు బతుకమ్మ వేడుకలను గురువారం కన్నుల పండువగ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు సాంప్రదాయ దుస్తులు ధరించి రంగురంగుల పూలను పేర్చి బతుకమ్మలను తీర్చిదిద్దారు. స్కూల్ ఆవరణలో బతుకమ్మ పాటలతో ఆడుతూ పాడుతూ బతుకమ్మ వేడుకల్లో హుషారుగా పాల్గొన్నారు. స్కూల్? కరస్పాండెంట్? డాక్టర్ మంచాల శ్రీనివాసులు, ఇంచార్జీ జ్యోతి, టీచర్లు సంపూర్ణ, విజయ్,ఐలయ్య, పుష్పలత, స్టూడెంట్స్? పేరెంట్స్ పాల్గొన్నారు.

## సామాజిక, ఆర్థిక అసమానతలు లేని సమ సమాజ స్థాపన కోసం కెవిపిఎస్ పోరాటం

### ఆవిర్భావ వార్షికోత్సవ సభలో జిల్లా అధ్యక్షులు ఓరుగంటి సాంబయ్య



**వేలేరు అక్టోబర్ 03 (ప్రజామంటలు):** వేలేరు మండల కేంద్రంలో కేవిపిఎస్ 26 వ వార్షి కోత్సవ సభను మండల కన్వీనర్ వేల్పుల రవి అధ్యక్ష తన జెండా ఆవిష్కరించి ప్రారంభించగా. ఈ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా అధ్యక్షులు సాంబయ్య మాట్లాడుతూ 1998 అక్టోబర్ రెండున ఆవిర్భవించిన కెవిపిఎస్ 26 సంవత్సరాలను పూర్తిచేసుకుని తన ప్రస్థానంలో దళిత ఉద్యమాల పట్ల ఒక ప్రత్యేకమైన స్థానం సంపాదించుకుంది. ఈ రాష్ట్రంలో 129 రకాల కుల వివక్షతలు జరుగుతున్నా యని పున్నయ్య కమిషన్ వేయించి దాని ద్వారా ఈ ప్రభుత్వానికి ఒక నివేదిక అందించే విధంగా పోరాడి సాధించింది. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం, కులాంతర వివాహితులకు రెండు లక్షల 50 వేల నగదు ప్రోత్సాహం, 101 యూనిట్ల ఉచిత విద్యుత్ లాంటివి సాధించి పెట్టింది. ఈ రాష్ట్రం లో జరుగుతున్న కుల దురంకారహత్యలపై, దళితులపై జరుగుతున్న అనేక రకాల వివక్షతలపై నిరంతరం పోరాటం చేస్తుంది, కులాంతర వివాహేతులకు రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని, పెండింగ్లో ఉన్న నగదు ప్రోత్సాహ కలు వెంటనే విడుదల చేయాలని, ప్రతి నెల 30వ తేదీన గ్రీవెన్స్ డే ప్రకటించి అన్ని గ్రామాలల, మండల కేంద్రాలలో సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ, కలెక్టర్, ఎమ్మార్వో ఈ కార్యక్రమాల్లో పాల్గొని అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రజల్లో అవగాహన కల్పించి సమాజంలో ఉన్న అతి భయం కరమైన కుల, మత వ్యవస్థలను ధ్వంసం చేసి. సామా జిక, ఆర్థిక అసమానతులు లేని సమ సమాజ స్థాపన కోసం కృషి చేయాలని, రాబోవు కాలంలో అన్ని రకాల వివక్షతలపై కెవిపిఎస్ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వ హించేందుకు ఈ వార్షికోత్సవ సభ స్ఫూర్తిగా ప్రణాళి కలు రచిస్తున్నట్టు తెలిపారు, ఈ సభలో జిల్లా నాయకులు శీలం శ్రీనివాస్, మండల నాయకులు సాం బరాజు, నరసయ్య, మరియా, బొందమ్మ, భద్రయ్య, యాకూబ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అనంతరం కెవిపిఎస్ మండల కన్వీనర్ గా వేల్పుల రవి, కో కన్వీనర్ గా మూడపు సాంబరాజు, గౌరవ సలహాధారుగా మునిగడప నరసయ్య లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## డి.ఎం.జె.యు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా మంతూరి ఆంజనేయులు నియామకం



**హైదరాబాద్ అక్టోబర్ 03 (ప్రజామంటలు):** డిజిటల్ మీడియా జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా మంతూరి ఆంజనేయులు (హైదరాబాద్) బాధ్యతలు అప్పగిస్తూ తీర్మానించినట్లు డిఎంజెయు రాష్ట్ర కమిటీ నేడు పత్రిక ప్రకటనలో స్పష్టం చేసింది. యూనియన్ బలోపేతానికి కృషి చేస్తూ డిజిటల్ మీడియా జర్నలిస్టుల హక్కుల సాధనకై అహర్నిశలు సేవలు అందించగలడనే విశ్వాసాన్ని వ్యవస్థాపకులు ఎంపెల్లి ముతేష్, రాష్ట్ర అధ్యక్షులు కే. రాజేంద్ర ప్రసాద్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి బొడ్డు అశోక్ ప్రకటించారు. ఈపై సమావేశంలో ముఖ్య అతిథిగా డిఎంజెయు జాతీయ నాయకులు చందా శ్రీనివాస్ హాజరై, దిశానిర్దేశం చేశారు.




గొల్లపల్లి మండల కేంద్రంలో శ్రీ భక్తాంజనేయ దేవస్థానంలో విజయ దుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో మేళ తాళాల నడుమ అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ పాల్గొన్న భవానీ దీక్షాపరులు, భక్తజనులు

# తిరుమల శ్రీవారు అభిషేక ప్రియుడు


## బ్రహ్మోత్సవాల్లో నిత్యం అభిషేకాలు, అలంకరణలు - పూదండలతో అలంకరణల్లో శ్రీవారిది ప్రత్యేక స్థానం















తిరుమల,అక్టోబర్ 3 (ప్రజా మంటలు):
తిరుమల శ్రీవారు అభిషేక ప్రియుడే కాదు అలంకార ప్రియుడు కూడా. బ్రహ్మోత్సవాల్లో నిత్యం అభిషేకాలు, నైవేద్యాలు, అలంకరణలు ప్రత్యేకతను కలిగి ఉంటాయి. కోట్లాది మంది భక్తుల ఇలవేల్పు శ్రీ వెంకటేశ్వరుని అలంకారం భక్తుల్ని మంత్ర ముగ్ధుల్ని చేస్తోంది. వజ్ర వైఢూర్యాలు బంగారు ఆభరణాలు ధరించి భక్తులకు దర్శనం ఇచ్చి అలంకార ప్రియుడి సేవలో అనునిత్యం తరిస్తున్న పూదండలది ప్రత్యేక స్థానం. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వస్వామి పుష్పాలంకార ప్రియుడుగా భక్తులను కనువిందు చేస్తాడు. శ్రీనివాసునికి చేసే అనేక సేవలలో పుష్పకైంకర్యం అత్యంత ప్రియమైనదిగా నిలిచింది. పవిత్రమైన కార్యమని తిరువాయ్ మొళి అనే ప్రాచీన తమిళ గ్రంథంలోనూ ఈ విషయం ఉంది. స్వామివారి ఆపాదమస్తకం వివిధ రకాల సుగంధ భరిత కుసుమాలతో అలంకరించే అర్చకులు ఎన్నో పుష్పహారాలను దేవదేవునికి సమర్పిస్తారు. శ్రీనివాసునికి చేసే అనేక సేవలలో పుష్పకైంకర్యం అత్యంత ప్రియమైనదిగా నిలిచింది. పవిత్రమైన కార్యమని తిరువాయ్ మొళి అనే ప్రాచీన తమిళ గ్రంథంలోనూ ఈ విషయం ఉంది. స్వామివారి ఆపాదమస్తకం వివిధ రకాల సుగంధ భరిత కుసుమాలతో అలంకరించే అర్చకులు ఎన్నో పుష్పహారాలను దేవదేవునికి సమర్పిస్తారు. శ్రీనివాసునికి చేసే అనేక సేవలలో పుష్పకైంకర్యం అత్యంత ప్రియమైనదిగా నిలిచింది. పవిత్రమైన కార్యమని తిరువాయ్ మొళి అనే ప్రాచీన తమిళ గ్రంథంలోనూ ఈ విషయం ఉంది. స్వామివారి ఆపాదమస్తకం వివిధ రకాల సుగంధ భరిత కుసుమాలతో అలంకరించే అర్చకులు ఎన్నో పుష్పహారాలను దేవదేవునికి సమర్పిస్తారు. కిరీటం మీద నుంచి రెండు భుజాలమీది వరకు అలంకరించే ఒకే ఒక దండను శిఖామణి. ఇది ఎనిమిది మూరల దండ. శ్రీవారి భుజాల నుండి ఇరువైపులా పాదాల వరకు వేలాడుతూ ఉండే సాల గ్రామాల మాలలకు ఆనుకొని వేలాడదీస్తూ అలంకరింపబడే పొడవైన పూలమాలలు. ఇవి రెండుమాలలు కాగా ఒక్కొక్కటి సుమారు 4 మూరలు ఉంటాయి. శ్రీవారి భుజాల నుండి ఇరువైపులా పాదాల వరకు వేలాడుతూ ఉండే సాల గ్రామాల మాలలకు ఆనుకొని వేలాడదీస్తూ అలంకరింపబడే పొడవైన పూలమాలలు. ఇవి రెండుమాలలు కాగా ఒక్కొక్కటి సుమారు 4 మూరలు ఉంటాయి. శ్రీవారి మెడలో రెండు పొరలుగా రెండు భజాలపై అలంకరింపబడే దండ కంఠసరి. ఇది ఒకటి మూడున్నర మూరలు ఉంటోంది.శ్రీవారి వక్షఃస్థలంలో ఉన్న శ్రీదేవి భూదేవీ లకు అలంకరించే రెండు పూలదండల్లో ఒక్కొక్కటి ఒకటిన్నర మూర ఉంటుంది. శ్రీవారి వక్షఃస్థలంలో ఉన్న శ్రీదేవి భూదేవీ లకు అలంకరించే రెండు పూలదండల్లో ఒక్కొక్కటి ఒకటిన్నర మూర ఉంటుంది. శ్రీ వెంకటేశ్వర స్వామి వారి బొడ్డున వున్న నందక ఖడ్గానికి అలంకరించే దండ ఇది. ఈ పూదండ రెండు మూరలుగా ఉంటుంది. రెండు మోచేతుల కింద, నడుము నుండి మోకాళ్ళపై హారాలుగా, మోకాళ్ళ నుండి పాదాల వరకు వ్రేలాడదీసే మూడు దండలే తావళములు. ఇందులో ఒకటి మూడు మూరలు, మరొకటి మూడున్నర మూరలు, ఇంకొకటి నాలుగు మూరలు ఉంటుంది. శ్రీవారి పాదాలపై చుట్టూ అలంకరించే రెండు దండలే తిరువడి దండలు. ఒక్కొక్కటి ఒక్క మూర ఉండగా ప్రతి గురువారం జరిగే పూలంగి సేవ లో మాత్రమే స్వామివారి మూలమూర్తి కి ఆభరణాలన్నీ తీసివేసి ఈ మాలలతో పాటు నిలువెల్ల స్వామి వారిని విశేషంగా పూలమాలలతో అలంకరిస్తారు. ఇవిగాక శ్రీవారి ఆనంద నిలయంలోని వివిధ ఉత్సవమూర్తులకు కూడా ఎన్నో పూలమాలలు టిటిడి సిద్ధం చేస్తుండగా అర్చక స్వాములు అలంకరిస్తారు. ఉత్సవమూర్తులకు నిత్యమూ అలంకరించే పూలదండల్లో భోగ శ్రీనివాసమూర్తికి ఒక దండ, కొలువు శ్రీనివాసమూర్తికి ఒక దండ, శ్రీదేవి భూదేవి సహిత మలయ్యప్పస్వామికి మూడు దండలు అర్చకులు అలంకరిస్తారు. ఇక బంగారువాకిలి ద్వారపాలకులకు రెండు దండలు, గురడాళ్వారు కు ఒక దండ. వరదరాజస్వామి మరొక దండ, వకుళమాలిక ఒక దండ, భగవద్రామానుజులుమూలమూర్తి, ఉత్సవమూర్తికి రెండు దండలు. యోగనరసింహస్వామికి ఒక దండ. విష్వక్సేనులవారికి ఒక దండ. పోటు తాయారుకు ఒక దండ, బేడి ఆంజనేయస్వామికి మరో పూల దండ, శ్రీ వరాహ స్వామి ఆలయానికి మూడు దండలను టిటిడి సమకూర్చుతోంది. ఇక కోనేటిగట్టు ఆంజనేయస్వామికి ప్రతి ఆదివారం మాత్రమే పూల దండ అలంకరిస్తోంది టిటిడి. ఇంకా శ్రీవారి నిత్య కల్యాణోత్సవం, వసంతోత్సవం, ఊరేగింపులు, ఉత్సవాలకు గాను ప్రత్యేకంగా పూలమాలలు కూడ ఈ పూల అరలో కూర్చ బడుతున్న అర్చకులు వెంకన్నను అలంకార ప్రియుడిగా భక్తులకు దర్శనం కల్పిస్తున్నారు. మాలలకు గానూ తిరుమల క్షేత్రంలో తులసి, చామంతులు, గన్నేరులు, సన్న జాజులు, మొల్లలు, మొగిలి, కమలం, కలువ, రోజాలు, గులాబీలు, సంపెంగలు, సుగంధాలు, మామిడాకులు, తమలపాకులు, పచ్చి పసుపు చెట్లు, కనకాంబరం, మరువం, మాచీ పత్రం, దవనం, బిలువం ఇలా రంగురంగులతో సుగంధ పరిమళాలును వెదజల్లే ఎన్నో పుష్ప జాతులను, పత్రాలను శ్రీవారి పుష్ప కైంకర్యంలో వినియోగిస్తున్నారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం రెండు పూటలా శ్రీవారికి జరిగే పుష్ప కైంకర్యం తోమాల సేవకు గాను పుష్ప అర నుండి సిద్ధం చేయబడిన పూల మాలలను, జియ్యంగార్లు తలపై పెట్టుకొని బాజా భజంత్రీలతో ఛత్ర చామర మర్యాదలతో వేదమంత్రోచ్ఛారణలతో ఊరేగింపుగా బయలుదేరి ధ్వజస్థంభానికి ప్రదక్షిణంగా వచ్చి విమాన ప్రదక్షిణం చేస్తూ శ్రీవారి సన్నిధిలో సమర్పించడం జరుగుతుంది. ఇలా తిరుమల క్షేత్రంలో శ్రీవారికి నిత్యం సమర్పించే పూలదండలు వెదజల్లే సువాసనలు, అలంకరణలు భక్తుల్ని మైమరిపిస్తున్నాయి.













## వివాదం ముదరడంతో వెనక్కి తగ్గిన కొండా సురేఖ


### వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నట్లు వెల్లడి - బేషరతుగా క్షమాపణలు కోరుతూ ప్రకటన



వరంగల్,అక్టోబర్ 3 (ప్రజా మంటలు):
మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు వివాదాస్పదమవుతున్న వేళ.. ఆమె ఓ మెట్టు దిగొచ్చారు. అక్కినేని, సమంత కుటుంబానికి బాధించడం తన ఉద్దేశం కాదని ఆమె అన్నారు. ఈ మేరకు సమంత ఎక్స్ పోస్ట్‌కు మంత్రి సమాధానం ఇచ్చారు. సినీ రంగంలో సమంత ఎదిగిన తీరు తనకు ఆదర్శమన్నారు. 'మహిళా నాయకుల పట్ల ఓ నాయకుడి చిన్నచూపు ధోరణి ప్రశ్నించాలన్నదే నా ఉద్దేశం. మీ మనోభావాలు దెబ్బ తీయాలని కాదు. స్వశక్తితో మీరు ఎదిగిన తీరు నాకు ఆదర్శం. మీరు కానీ, మీ అభిమానులు కానీ మనస్తాపానికి గురైతే నా వ్యాఖ్యలను ఉప సంహరించుకుంటున్నా. క్షమించండి' అంటూ సమంతకు ఎక్స్‌లో రీపోస్ట్ చేశారు. భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తనపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడంతో భావోద్వేగానికి గురైనట్లు మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఆయనపై విమర్శలు చేసే క్రమంలో అనుకోకుండా ఓ కుటుంబాన్ని ప్రస్తావించినట్లు చెప్పారు. హనుమకొండలో ఆమె మీడియాతో మాట్లాడారు. తనకు ఎవరిమీద వ్యక్తిగత ద్వేషం లేదన్నారు. ఆ కుటుంబ సభ్యులు పెట్టిన పోస్టు చూసి చాలా బాధపడినట్లు తెలిపారు. ఏ విషయంలో నేను బాధపడ్డానో.. ఆ విషయంలో మరొకరిని నొప్పించానని తెలిసి వ్యాఖ్యలను బేషరతుగా ఉపసంహరించుకున్నాను. నేను పడిన బాధ వేరేవాళ్లు పడకూడదని ఈ నిర్ణయం తీసుకున్నాను. అప్పుడే దీనిపై స్పందిస్తూ ఎక్స్‌లో పోస్టు చేశాను. కేటీఆర్ విషయంలో మాత్రం తగ్గేది లేదు.. ఆయన క్షమాపణ చెప్పాల్సిందే. ఆయనే చేసిందంతా చేసి నన్ను క్షమాపణ చెప్పమనడం.. దొంగే.. దొంగా దొంగా అన్నట్లుగా ఉంది. కేటీఆర్ లీగల్ నోటీసుపై న్యాయపరంగా ముందుకెళ్తాం అని కొండా సురేఖ తెలిపారు. మాజీ మంత్రి కేటీఆర్‌ని ఉద్దేశిస్తూ అక్కినేని ఫ్యామిలీతో ముడిపెడితూ.. కొండా సురేఖ సమంత విడాకుల గురించి మాట్లాడిన విషయం తెలిసిందే. కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలను కింగ్ నాగార్జున తీవ్రంగా ఖండిస్తూ.. అబద్దాలుగా కొట్టిపారేశారు. తాజాగా సమంత కూడా ఇన్‌స్టా వేదికగా మంత్రికి సమాధానమిచ్చింది. దీనికితోడు సినీ పరిశ్రమకు చెందిన వారంతా నిలదీయడంతో కొండా సురేఖ నాలుక కరచుకున్నారు. బేషరతుగా క్షమాపణలు వేడుకున్నారు.

## కూల్చివేతలకు అధికారులు తాత్కాలిక బ్రేక్

### ఇళ్ళు ఖాళీ చేయక పోవడంతో నిర్ణయం



హైదరాబాద్,అక్టోబర్ 3 (ప్రజా మంటలు):
మూసీ సుందరీకరణ ప్రాజెక్ట్‌లో భాగంగా మూసీ పరివాహక ప్రాంతాల్లో ఆక్రమణల తొలగింపుకు బ్రేక్ పడింది. శంకర్ నగర్, మూసానగర్‌లో స్థానికులు ఇళ్ళు ఖాళీ చేయక పోవడంతో అధికారులు కూల్చివేతలను నిలిపివేశారు. ఈ కూల్చివేతలకు రెవెన్యూ అధికారులు తాత్కాలిక బ్రేక్ ఇచ్చారు. ఓల్డ్ మలక్‌పేట్, శంకర్‌నగర్‌లో 450 ఇళ్లను అధికారులు గుర్తించారు. ఇప్పటి వరకు 140 ఇళ్లు కూల్చివేసి బాధితులను చంచల్‌గూడలో ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్లకు తరలించారు.ఖాళీ చేసిన ఇళ్లను ఇప్పటి వరకు అధికారులు కూల్చివేశారు. అయితే కొంతమంది బాధితులు డబుల్ బెడ్రూమ్ ఇళ్లు కేటాయించినప్పటికీ ఖాళీ చేయని పరిస్థితి. హైదరాబాద్ శివారులో డబుల్ బెడ్‌రూంలు కేటాయించారని.. ఒక్కో ఇంట్లో 16 మంది ఉన్న వారికి డబుల్ బెడ్ రూంలు ఏం సరిపోతాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారంతా ఇళ్లు ఖాళీ చేయని నేపథ్యంలో అధికారులు కూల్చివేతలకు కాస్త బ్రేక్ ఇచ్చారు. అయితే బాధితులకు డబుల్ బెడ్ రూమ్‌తో పాటు 25 వేల సహాయాన్ని ప్రభుత్వం అందజేస్తున్న విషయం తెలిసిందే. కాగా.. ఆపరేషన్ మూసీలో భాగంగా రెండు రోజుల క్రితమే మూసీపరివాహక ప్రాంతాల్లో ఇళ్లను కూల్చివేసే పనులను ప్రారంభించారు రెవెన్యూ అధికారులు. ఖీః– చీ అని రాసి, ఇళ్ళు ఖాళీ చేసిన వాటిని అధికారులు కూల్చివేస్తున్నారు. ఎలాంటి అవాంతరాలు జరుగకుండా భారీ బందోబస్తు నడుమ ఇళ్లను కూల్చివేశారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్ట్‌ను తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌ను వరదల నుంచి రక్షించేందుకు, ఆక్రమణకు గురైన మూసీ నది పరివాహక ప్రాంతాలను పునరుద్ధరించి, కాలుష్య కోరల నుంచి మూసీని కాపాడేందుకు ప్రభుత్వం మూసీ సుందరీకరణ ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టింది. అధికారులు ముందుగా మూసీ నది ఎఫ్‌టీఎల్ పరిధిని సర్వే చేశారు. అందులో దాదాపు 16 వేల నివాసాలు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నట్లు తేలింది. ఇందులో పేద, మధ్యతరగతి వారు నివసిస్తున్నారు. దీంతో ప్రభుత్వం.. మూసీ సుందరీకరణ ప్రాజెక్ట్‌లో భాగంగా ఎఫ్‌టీఎల్ పరిధిలో నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్న పేదలకు ఉచితంగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలని నిర్ణయించింది. అందుకోసం ఇప్పటికే జీఓ కూడా జారీ చేసింది. అయితే డబుల్ బెడ్రూమ్‌లు ఎవరికి ఇవ్వాలనే దానిపై తాజాగా రెవెన్యూ అధికారులు సర్వే చేసి.. గుర్తించి ఇళ్లపై ఖీః–చీ (ఖీతిల।సశి।ట ఇఖీబిస।ప।) అని రాశారు. అయితే పలు ప్రాంతాల్లో మార్క్ సర్వే చేసిన అధికారులు స్థానికులు అడ్డుకున్నారు. అధికారులపై తిరగబడ్డారు. దీంతో పలు ప్రాంతాల్లో ఉద్రిక్త వాతావరణ నెలకొంది. డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తామని ప్రభుత్వం చెప్పినప్పటికీ పలువురు స్థానికులు ఆందోళనకు దిగారు. మూసీ రివర్ బెడ్‌లో ఉన్న ఇళ్లు, వాటి యాజమానుల వివరాలు నమోదు చేసేందుకు వచ్చిన అధికారులను పలు ప్రాంతాల్లో నివాసితులు అడ్డుకున్నారు. చివరకు పోలీసు బందో బస్తు నడుమ మార్క సర్వేను అధికారులు కొనసాగించారు.

DIGITALLY PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AT 6-3-144, bRAHMAN WADA, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL 2021/81092
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com